

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా యలమంచిలి అపర్ణ



విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన యలమంచిలి అపర్ణను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆమె 90వ వార్డు టీడీపీ అధ్యక్షుని భార్య. యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. ఇంకో మూడు రోజుల్లో మొత్తం కమిటీ సభ్యులను కూడా ప్రకటించే అవకాశం ఉంది.







ఐపీఎల్ ఫీవర్

నగరానికి చేరుకున్న సన్‌రైజర్స్ క్రీడాకారులు మహ్మద్ షమీ, ఇషాన్ కిషన్, నితీశ్‌కుమార్‌రెడ్డి

- నగరంలో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్
- హాట్‌కేకుల్లా టికెట్ల అమ్మకం

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌పై క్రీడాభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజర్స్ ఏసీఏ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్‌గా చేసుకున్నా...క్రీడాభిమానులు మాత్రం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును హోమ్ టీమ్‌గా భావిస్తున్నారు. గత రెండు సీజన్ల నుంచి అద్భుతమైన ఆటతీరును కనబరుస్తోన్న సన్‌రైజర్స్ జట్టు ఈ సీజన్ టైటిల్ ఫేవరెట్‌లలో ఒకటిగా ఉంది. ఈ నేపథ్యంలో మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు.

రూ.4 వేలు, రూ.6 వేలు మినహా అన్ని టికెట్లు ఫుల్

సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆదివారం జరిగే మ్యాచ్‌కు డిమాండ్ రావడంతో టికెట్లు దాదాపుగా అమ్ముడైపోయాయి. శుక్రవారం రాత్రి సమయానికి ఏ స్టాండ్‌లోని నాలుగు వేల రూపాయల టికెట్లు కొన్ని, సౌత్ వెస్ట్ అప్పర్ స్టాండ్, సౌత్ ఈస్ట్ అప్పర్ స్టాండ్‌లో రూ.ఆరు వేలు విలువ గల టికెట్లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన టికెట్లు అన్నీ అమ్ముడైపోయాయి.

ప్రేమికుల ఆత్మహత్య

- ఆమె మైనర్...
- అతనికి అంతకుముందే వివాహం
- బాలికను పెళ్లి చేసుకునేందుకు నెల కిందట విడాకులు
- వడ్లపూడిలో సంఘటన



అమీరుద్దీన్‌ఖాన్ (ఫైల్ ఫొటో)

కూర్మన్నపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): **పెళ్లికి పెద్దలు అంగీకరించలేదనే కారణంతో ప్రేమికులు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన విశాఖ నగర పరిధిలోని వడ్లపూడిలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించి దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.**

నగరంలోని మర్రిపాలెం సమీప హర్షనగర్‌కు చెందిన అమీరుద్దీన్‌ఖాన్ (36) ఏడాదిగా సింహాచలం గోశాల వద్ద టిఫిన్ దుకాణం నడుపుతున్న పిన్నింటి జయశ్రీ వద్ద చెఫ్‌గా పనిచేస్తున్నాడు. ఆ సమయంలో జయశ్రీ కుమార్తె పిన్నింటి వెంకట దుర్గ(17)తో చనువుగా ఉండేవాడు. ఆమె స్థానిక కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తన కుమార్తెతో అమీరుద్దీన్‌ఖాన్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో అతడిని జయశ్రీ పని నుంచి తొలగించింది. కాగా అమీరుద్దీన్‌కు గతంలోనే వివాహమైంది. అయితే జయశ్రీ కుమార్తెను పెళ్లి చేసుకునేందుకు వీలుగా నెల రోజుల కిందట విడాకులు తీసుకున్నాడు.

ఇదిలావుండగా జయశ్రీ తన కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తోంది. తాను ఇష్టపడిన అమీరుద్దీన్‌ఖాన్‌తో పెళ్లికి తల్లి అంగీకరించే ప్రసక్తి లేదని తెలుసుకున్న ఆమె శుక్రవారం ఉదయం తల్లి టిఫిన్ దుకాణానికి వెళ్లిపోయిన తరువాత ఇంటి నుంచి బయటకు వచ్చింది. దుకాణం నుంచి తిరిగి ఇంటికి వెళ్లిన జయశ్రీకి... అక్కడ ... మిగతా 4వ పేజీలో

లీజుకు ఓఎఫ్‌సీ నెట్‌వర్క్

ఈపీడీసీఎల్ యోచన

అదనపు ఆదాయం సాధించేందుకు యత్నం

- బిడ్ల ఆహ్వానం
- జాతీయ స్థాయిలో ఆసక్తి
- ఎయిర్‌టెల్ వంటి సంస్థల సంప్రతింపులు
- ప్రస్తుతం కిలోమీటరుకు రూ.20 వేలు వసూలు చేస్తున్న బీఎస్ఎన్ఎల్
- విద్యుత్ పంపిణీ సంస్థ వద్ద 218 కిలోమీటర్ల మేర 96 ఫైబర్లు...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ-ఈపీడీసీఎల్) ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ) వ్యాపారంలోకి అడుగు పెట్టింది. దీని ద్వారా అదనపు ఆదాయం సాధించే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన ఇవ్వగా జాతీయ స్థాయిలో పలు కంపెనీలు ఆసక్తి కనపరుస్తున్నాయి.



ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ)

విశాఖపట్నంలో హుద్‌హుద్ తుపాన్ వచ్చినప్పుడు విద్యుత్ వ్యవస్థ ఛిన్నాభిన్నమైన సంగతి తెలిసిందే. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి అలాంటి విపత్తు వస్తే విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా తీర ప్రాంతమంతా భూగర్భ విద్యుత్ కేబుల్ వేయాలని ఆదేశించారు. దాంతో రాష్ట్రంలో తొలిసారి విశాఖ నగరంలో మొదటి దశలో సముద్ర తీర ప్రాంతంలో 218 కి.మీ. పొడవున భూగర్భంలో విద్యుత్ కేబుళ్లు వేశారు. ఆ సమయంలోనే విద్యుత్ కేబుల్‌తో పాటు '96 ఎఫ్' సామర్థ్యం కలిగిన ఓఎఫ్‌సీని వేశారు. దీనిని ఇంటర్నెట్ కోసం వినియోగిస్తారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈపీడీసీఎల్‌కు అవసరం లేకపోయినా ఆనాడు ఆ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు దానిని ఉపయోగించుకోవాలని ప్రస్తుత సీఎండీ పృథ్వీతేజ్ కార్యాచరణ రూపొందించారు. ఇటీవల రెండో దశలో 907 కి.మీ. మేర భూగర్భ కేబుల్ వేయడానికి పనులు ప్రారంభించారు. దీనికోసం మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో రహదారులను తవ్వాల్సి వచ్చింది. దీనికి ఆ సంస్థ కి.మీ.కు కోటి రూపాయలు కట్టాలని డిమాండ్ చేసింది. ఈ ప్రాజెక్టు వ్యయమే అంత లేదని కలెక్టర్‌కు చెప్పి ఆ ఖర్చును తగ్గించుకున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎండీ పృథ్వీతేజ్...భూగర్భంలో కేబుల్ వేయడానికి తవ్వకం ఖర్చు కి.మీ.కు కోటి రూపాయలు అవుతుంటే..ప్రస్తుతం ఇంటర్‌నెట్ సేవలు అందిస్తున్న సంస్థలు ఓఎఫ్‌సీ వేయడానికి, నిర్వహణకు ... మిగతా 5వ పేజీలో

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్

- ప్రధాన కార్యదర్శిగా ఎల్‌పీ నాయుడు



ఎంకే శ్రీనివాస్



ఎల్‌పీ నాయుడు

విశాఖపట్నం లీగల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా ఎంకే శ్రీనివాస్ ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి నమ్మి సన్యాసిరావుపై 862 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. శ్రీనివాస్‌కు 1,531 ఓట్లు రాగా, సన్యాసిరావుకు 669 వచ్చాయి. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఎల్‌పీ నాయుడు తన సమీప ప్రత్యర్థి పి.సుధాకర్‌పై 568 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎల్‌పీ నాయుడికి 1,028 ఓట్లు, సుధాకర్‌కు 460 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షునిగా సీహెచ్ ఆనందరావు గెలుపొందారు. కాగా ఎన్నికల్లో 2,310 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారిగా ... మిగతా 4వ పేజీలో

ఉక్కులో కాంట్రాక్టు కార్మికుల సమ్మె

- విభాగాధిపతుల కార్యాలయాల ముందు నిరసన
- అడ్మిన్ భవనం లోపలకు వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు
- ప్రధాన పరిపాలనా భవనం ఎదుట బైఠాయింపు



ప్లాంటులోని అడ్మిన్ భవనం ముందు ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇటీవల తొలగించిన వారిని వెంటనే తిరిగి తీసుకోవాలని, గేట్ పాస్‌లు గతంలో మాదిరిగా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌లతో స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి 24 గంటల సమ్మె ప్రారంభించారు. కార్మికులు ఉదయం ఆరు గంటలకు ప్లాంటు గేట్ల (ప్రధాన గేటు, బీసీ గేటు, విస్తరణ గేటు) వద్దకు చేరుకున్నారు. ఉక్కు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొమ్మిది గంటల సమయంలో ప్లాంటు లోపలకు వెళ్లినప్పటికీ విధులను బహిష్కరించి, ఆయా విభాగాధిపతుల కార్యాలయాల వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. సాయంత్రం నాలుగు గంటలకు కోక్-ఓవెన్ విభాగం వద్దకు చేరుకొని అక్కడ నుంచి ప్రధాన పరిపాలనా భవనం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన పరిపాలనా భవనం లోపలకు వెళ్లేందుకు కార్మికులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ... మిగతా 5వ పేజీలో

నేడు జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

- రూ.4,761 కోట్లతో రూపకల్పన
- మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీస్ నేపథ్యంలో ఉత్కంఠ



విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ 2025-26 బడ్జెట్ సమావేశం శనివారం జరగనున్నది. సుమారు రూ.4,761 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. ఆర్థిక సంవత్సరం ముగియక ముందే కౌన్సిల్ కూడా ఆమోదించాల్సి ఉంది. ఇదిలావుండగా మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై అవిశ్వాసం తీర్మానం నోటీస్‌ను కూటమి కార్పొరేటర్లు ఇటీవల కలెక్టర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు ముందు జాగ్రత్తగా వారి పార్టీకి చెందిన కార్పొరేటర్లను బెంగళూరు తరలించేశారు. వారితో పాటు మేయర్ హరికుమారి, డిప్యూటీ మేయర్లు కూడా వెళ్లారు. జీవీఎంసీలో మొత్తం 111 మంది ఓటింగ్ సభ్యులు ఉండగా వారిలో కోరం ఉంటే తప్ప బడ్జెట్ సమావేశం నిర్వహించడానికి వీల్లేదు. మేయర్ లేకుండా ఎలా నిర్వహిస్తామని ... మిగతా 4వ పేజీలో

గనుల శాఖ కొరడా

అనుమతులు లేకుండా గుర్రంపాలెంలో గ్రావెల్ తవ్వకాలు జరిపిన వారికి నోటీసులు ఇవ్వాలని నిర్ణయం

- తొమ్మిది మందికి తొలుత షోకాజ్
- 5.2 లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వినట్టు నిర్ధారణ
- రూ.40 కోట్ల జరిమానా కట్టాల్సి ఉంటుందని అంచనా
- మరోవైపు కేసు మాఫీకి ఉన్నత స్థాయిలో పైరవీలు



పెందుర్తి మండలం గుర్రంపాలెంలో గ్రావెల్ తవ్వకాలు (ఫైల్ ఫొటో)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): **పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ పారిశ్రామిక లేఅవుట్, పక్కన రెవెన్యూ పరిధిలో గల కొండ నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్విన వారిపై ఎట్టకేలకు కొరడా ఝుళిపించేందుకు గనుల శాఖ సిద్ధమైంది. మొత్తం తొమ్మిది మందికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని నిర్ణయించింది.అనుమతులు లేకుండా 5.2లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినందుకు అన్ని రకాల పన్నులు కలిపి సుమారు రూ.40 కోట్ల వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.**

ఏపీఐఐసీ లేఅవుట్‌లో ఎనిమిది ప్లాట్లు కొనుగోలుచేసిన పారిశ్రామికవేత్తలు వాటిని ఫిల్లింగ్ చేయడానికి సమీపంలో గల కొండ, దాని పక్కన రెవెన్యూ శాఖకు చెందిన కొండ నుంచి గత ఏడాదిగా అక్రమంగా గ్రావెల్ తవ్వుకున్నారు. నిబంధనల మేరకు అందుకు గనుల శాఖ నుంచి అనుమతులు పొందాలి. కానీ అవేమీ లేకుండా ఏపీఐఐసీ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారుల దన్నుతో భారీగా గ్రావెల్ తవ్వేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు రావడంతో తొలుత గనుల శాఖ రెగ్యులర్, ఆ తరువాత విజయనగరంలో గనుల శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ప్లాట్ల ఫిల్లింగ్‌కు వినియోగించిన గ్రావెల్‌ను లెక్కించారు. ఇంకా ఏపీఐఐసీ, రెవెన్యూ పరిధిలో గల కొండల వద్ద కొలతలు తీసుకున్నారు. మొత్తం 5.2 ... మిగతా 5వ పేజీలో

ప్రభుత్వ భూమిలో రహదారి నిర్మాణంపై సీరియస్



- అడ్డంగా 25 చోట్ల కందకాలు 6లో

చిన దబ్బందలో అనుమతులు లేకుండా నిర్మించిన రహదారిపై కందకం తీసిన రెవెన్యూ సిబ్బంది

మెట్రో రైలు ప్రాజెక్టుకు ఆరు నెలల్లో భూ సేకరణ

మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణం ప్రారంభించాలి

- 15 శాతం వృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి
- రుషికొండ, గంభీరంలలో అడ్వంచర్ స్పోర్ట్సు కాంప్లెక్స్‌లు
- జిల్లా అధికారులతో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. చిత్రంలో జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్ ఉన్నారు.

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర సాకారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషిచేయాలని అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ దిశానిర్దేశం చేశారు. ప్రజలకు సంతృప్తికరమైన రీతిలో సేవలు అందిస్తూ, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ సమ్మిళిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేయాలన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో అమరావతిలో సీఎం అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో చర్చకు వచ్చిన అంశాలను ఆయన శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులకు వివరించారు. అన్ని రంగాల్లో విశాఖను అగ్రస్థానంలో నిలపాలని, మహా నగరాన్ని మరింత అందంగా ... మిగతా 4వ పేజీలో



దర్శనానికి క్యూలో బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్లో) అమ్మవారు



గంట స్తంభం వద్ద భక్తులతో రద్దీగా ఉన్న మెయిన్ రోడ్డు

నూకాలమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- వేకువజాము నుంచే రద్దీగా క్యూలు
- వేలాది మంది రాకతో కిటకిటలాడిన పట్టణం
- ఘనంగా అమ్మవారి అనుపోత్సవం

భీమునిపట్నం,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నూకాలమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచే లైన్లలో క్యూ కట్టారు. ఈఓ మురళీమోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. ప్రత్యేక దర్శనం రూ.100, విశిష్ట దర్శనం రూ. 25, సాధారణ దర్శనం రూ.10, ఉచిత దర్శనాలు కల్పించారు. భక్తులు అమ్మ వారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనాల తరువాత ఆలయం నుంచి బయటకు వచ్చిన వారికి గుడివీధిలో వున్న మెహర్‌బాబా కేంద్రం మజ్జిగ, మెయిన్ రోడ్‌లో ఆనందం మెడికల్ స్టోర్స్ వద్ద కట్టమూరి స్వామీజీ కుటుంబీకులు పులిహోర, కళా సాహితి సభ్యురాలు ఉసిరికల చంద్రావతి తోటవీధిలో మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ పరిసరాల్లో ఉన్న చెత్తను పారిశుధ్య విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు. ఆలయ వంశపారంపర్య పూజారులు సత్యరాజు, వెంకటేష్, మారుతి, సందీప్, శివ, ఉమ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అమ్మవారి ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నాయకులు

ఘనంగా సతామి

పద్మనాభం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరంలో ముస్లింలు సతామి పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముస్లింలంతా మసీదుకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపి, రాత్రంతా జాగరణ ఉన్నారు. రంజాన్ మాసంలో ఈ 26వ ఉపవాసం చాలా ప్రత్యేకమైనది. సతామి పండుగ నాడు లైలాతుల్ ఖద్ర్ చేసుకుంటారు ఇదే రోజున ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ దివి నుంచి భువికి దిగివచ్చినట్టు భావిస్తారు.ఈమేరకు రాత్రంతా జాగరణ, ప్రార్థనలు చేసి భక్తితో గడిపారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ

పద్మనాభం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం, మద్ది, విజయరాంపురం, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్ టీడీపీ కార్యకర్తలకు శుక్రవారం సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి అధిష్ఠానం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. శనివారం జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో నాయ కులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బుగత ప్రకాశ్, శ్రీనివాసరావు, బుగత శివ, కనకల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ శుక్రవారం సభ్యత్వ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, ఉపాధ్యక్షుడు సారిపల్లి శ్రీనివాసరావు, వార్డు కార్యదర్శి బి. దొరబాబు, సన్యాసిరావు, యు. గోవిందరావు, బాబూరావు, మంగాదేవి పాల్గొన్నారు. కాగా అంతకముందు రవితేజ సాగర్‌నగర్ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని నీళ్లతో కడిగి శుభ్రం చేశారు.

ఈకేవైసీ గడువు పొడిగించాలి : సీపీఎం

పద్మనాభం రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రేషన్ లబ్ధిదారులకు సంబంధించి ఈకేవైసీ గడువు తేదీని పొడిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు కోరారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కె. ఆనందరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈకేవైసీ గడువు ఈనెలతో ముగియనుండడంతో దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో ప్రభుత్వం గడువు తేదీని పొడిగించాలని విన్నవించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



అధికారులకు చెక్కు అందిస్తున్న దాత

సింహాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని సాలిగ్రామపురం గ్రామానికి చెందిన వి. సత్యనారాయణ రూ.1,00,116లు విరాళంగా సమర్పించారు. విరాళాన్ని చెక్ రూపంలో ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షణాధికారి సివివి పద్మనాభరాజుకు శుక్రవారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

శ్మశానవాటికలో బెంచీల ఏర్పాటు

పద్మనాభం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని శ్మశాన వాటికలో స్థానిక యువకుడు కాళ్ల సంతోష్ తన సొంత నిధులతో రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. తన తాతయ్య రామినేని సూరప్పడు, తండ్రి కాళ్ల సూరప్పడు జ్ఞాపకార్థం వీటిని సమకూర్చారు. అలాగే గ్రామంలో కూడా మరో రెండు బెంచీలు ఏర్పాటు చేశారు.

గోస్తనీలో ఇసుక దొంగలు

- నదిలో యథేచ్ఛగా తవ్వకాలు
- ఉచితం మాటున అక్రమం
- రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా
- ముందుగా నాటు బండ్లతో తరలించి, ఒకచోట పోగులు
- అక్కడి నుంచి లారీలతో ఇతర ప్రాంతాలకు...
- తవ్వకాలతో నదిలో ప్రమాదకరంగా గోతులు

భీమునిపట్నం (రూరల్),మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : భీమిలి పరిసర ప్రాంతాల్లో ఉన్న గోస్తనీ నదిలో దొంగలు పడ్డారు.నదిలో ఉన్న ఇసుకను రాత్రి, పగలు అన్న తేడా లేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. నాటు బండ్ల ద్వారా ఇసుక ఉచితంగా తరలించు కోవచ్చునన్న ప్రభుత్వ నిబంధనలను ఆసరాగా తీసుకుంటున్నారు. ముందు బండ్లతో తరలించిన ఇసుకను ఒక చోట పోగు చేసి, అక్కడి నుంచి లారీలతో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా.. పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నియోజకవర్గంలో గోస్తనీ నది 16 కిలోమీటర్లు మేర విస్తరించి ఉంది. నదిలో ఇసుక తరలింపునకు అక్రమార్కులు పలు రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇసుక తరలింపుపై నిషేధం ఉన్నప్పటికీ పలుచోట్ల రహస్యంగా రోడ్లు ఏర్పాటు చేసి, రాత్రి పూట ఎవరికీ తెలియకుండా నదిలోని ఇసుకను తరలిస్తున్నారు. నది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాల నాయకులు ఇసుక వ్యాపారులతో రహస్య ఒప్పందాలు చేసుకోవడంతో ఈ అక్రమం యథేచ్ఛగా సాగిపోతోంది. పద్మనాభం మండలం పొట్నూరులో గోస్తనీ నది నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి మద్ది, విలాస్కానిపాలెం, పద్మనాభం, కృష్ణాపురం, కురపల్లి గ్రామాల మీదుగా భీమిలిలోని మజ్జి వలస, తాటితూరు, నగరపాలెం గ్రామాల నుంచి తగరపువలస వచ్చి అక్కడి నుంచి చిట్టివలస, మూలకుద్దు మీదుగా భీమిలిలో సముద్రంలో కలుస్తుంది. నది ప్రవాహ ప్రాంతంలో నదిలోనూ, నదిని ఆనుకుని ఉన్న తీరంలోనూ ఇసుక మేటలు పుష్కలంగా ఉన్నా యి. వీటిని తరలించడానికి అక్రమార్కులు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇసుక తరలింపుపై నిషేధం ఉంది. ప్రభుత్వమే ఇసుకను వినియోగదారులకు ఉచితంగా అందించడానికి రీచ్‌లు నిర్వహిస్తోం ది. కానీ ఉచితంగా లభిస్తున్నందున ఇసుక తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉచితం మాటున అక్రమం

నదిలోని ఇసుకను కొంతమంది అనధికారికంగా తరలిస్తున్నారు. నాటు బండ్లతో సొంత అవసరాలకు ఇసుక తీసుకోవచ్చునన్న నిబంధనలను ఆసరాగా మార్చుకుంటున్నారు. బండ్ల ద్వారా కూలీలను పెట్టి, రహస్యంగా రోడ్లు వేసి, రాత్రి పూట ఇసుక తరలిస్తున్నారు. అధికారులు నదీ పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తే తాత్కాలిక రహదారులు కనిపిస్తాయి. మెయిన్ రోడ్లపై ఇసుక లారీలు పట్టుకుని, అనుమతులను పరిశీలిస్తున్న అధికారులు తాత్కాలిక రహదారుల వద్ద నిఘా ఏర్పాటు చేస్తే ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చు. కొంతమంది తమ ఇళ్ల ముందు ఇసుక కుప్పలుగా వేసి, అమ్మకాలు చేస్తున్నారు. వీరికి ఇసుక ఎక్కడి నుంచి ఎలా వస్తుందన్న విషయాన్ని పరిశీలన చేస్తే అక్రమ రవాణా వెలుగులోకి వస్తుంది.



నది ఒడ్డున నిల్వ చేసిన ఇసుక

ప్రమాదకరంగా గోతులు

తవ్వకాల వల్ల నదిలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. నదిలోకి నీరు ప్రవహించే సమయంలో గోతుల్లో నీరు చేరి చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే చిట్టివలస, సామేయవలస, బోని ప్రాంతాల్లో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఇన్‌ఫి ల్టర్ బావుల చుట్టూ ఉన్న ఇసుకను తరలించడం వల్ల వాటిలో నీరు నిల్వ ఉండడం లేదు.నదిలో ఇసుక తవ్వకాలను అరికట్టడంతో పాటు నీరు నిల్వ ఉండ డానికి అవసరమైన చెక్ డ్యామ్‌లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అవంతిలో యువజనోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

తగరపువలస,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థానాలకు చేరాలని మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. తగరపువలస సమీపంలో ఉన్న అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ యువజనోత్సవాలను శుక్రవారం ఆయన కృష్ణా యూనివర్సిటీ వీసీ రాంజీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన విద్యా విధానం ప్రకారం విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై కూడా నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఇండియన్ వెయిట్ లిఫ్టర్, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి మాట్లాడుతూ క్రీడలు సమాజంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. అనంతరం సినీ గాయకుడు శ్రీకృష్ణ, నేహ హుషారైన పాటలతో యువతను ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో అజినోమోటో బయోఫార్మా సర్వీసెస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆదిత్య కిరణ్, అవంతి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ ప్రియాంక, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రాజు, అవంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనము లు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామి వారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

గ్యాట్‌కు అనూహ్య స్పందన



ఆన్‌లైన్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ గౌతమ్‌రావు

సాగర్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో పలు కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్)కు అనూహ్య స్పందన లభించింది. తొలి విడతగా దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 42 పట్టణాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. శుక్ర, శనివారం కూడా పరీక్ష నిర్వహించనున్నట్టు వర్సిటీ ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు తెలిపారు. ఈమేరకు ఆయన విశాఖ ఆవరణలో ఆన్‌లైన్ ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కోర్సులు నిర్వహిస్తున్నామని, దాదాపు రూ. 100 కోట్లతో సైన్స్ ప్రయోగశాలలను అభివృద్ధి చేశామని తెలిపారు. గీతం అడ్మిషన్‌ల డైరెక్టర్ ఎం. జగదీష్ మాట్లాడుతూ గ్యాట్‌లో లభించిన మార్కుల ఆధారంగా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని, పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఉపకార వేతనాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల తిరువీధి




సింహాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ముందుగా సింహవల్లీ తాయార్, చతుర్భుజి తాయార్ల ఉత్సవమూర్తులను పుష్పమాలికలతో అలంకరించి, పల్లకిలో ఉంచారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ సాయంత్రం బేడా మండప తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టదిక్పాలకులకు పూజలు చేసి నీరాజనాలిచ్చారు. ఉదయం ప్రభాతారాధనల తరువాత లక్ష కుంకుమార్చ చేశారు.

మహా కామేశ్వరస్వామి ఆలయంలో పూజలు



మధురవాడ,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలితత్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కొత్త అమావాస్య పురస్కరించుకుని శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న నందీశ్వరుడికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు.ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

'అదనపు విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి'



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు అప్పలరాజు

మధురవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అదనపు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం మధురవాడ జోన్ నాయకుడు డి. అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏపీఈపీడీసీఎల్ మధురవాడ జోన్-3 కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై రూ. 16వేల కోట్ల ట్రూ అప్ చార్జీల భారం వేసిందన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన స్మార్ట్ మీటర్ల ఏర్పాటును కూడా కొనసాగించేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 18 మందికి జరిమానా

పెందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):పెందుర్తి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి కోర్టు రూ. 1.80 లక్షల జరిమానా విధించిందని ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని తనిఖీల్లో పట్టుకుని శుక్రవారం రెండో స్పెషల్ జ్యూడిషియల్ కోర్టు ముందు హాజరుపరచగా జడ్జి తీర్పు చెప్పారన్నారు.

ఇద్దరికి ఉగాది పురస్కారాలు

సింహాచలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30న ఇవ్వనున్న ఉగాది పండిత పురస్కారాలకు సింహాచలం దేవస్థానం నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. దేవస్థానం రుగ్వేద పండితులు ఎంఎస్ఎస్‌వీవీ సుబ్రహ్మణ్యం, ముఖ్య అర్చకుడు బీహెచ్ రాజగోపాల్ ఎంపికయ్యారు. అలాగే ఉగాది రోజున సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో జరగనున్న పండిత సత్కారాలకు విశ్రాంత ప్రధానార్చకుడు కేకే తిరు వెంగళాచార్యులు, గొడవర్తి కృష్ణమాచార్యులు, విశ్రాంత ప్రధాన కుక్ (కరోడా) ఏవీ రాఘవాచార్యులను వైదిక కమిటీ ఎంపిక చేసింది. వారితో పాటు పంచాంగ కర్త తెన్నేటి శ్రీనివాస శర్మను ఈఓ సత్కరించనున్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

పద్మనాభం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస గ్రామంలో రూ. 60 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంకు నిర్మాణానికి గ్రామ పెద్దలు శుక్రవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గ్రామంలో మంచినీటి ట్యాంకుతో పాటు ఇంటింటికి కొళాయిల ఏర్పా టుకు రూ. 60 లక్షలు మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కె. రామరాజు, మాజీ సర్పంచ్ పల్లి మహేష్, మహంతి అప్పలరమణ, సంతోష్, రమణ, గణేష్‌బాబు పాల్గొన్నారు.

'విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి'

కొమ్మాది, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని చెప్పారు. అనంతరం విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్, కళాశాల ప్రిన్సిపాల్ కె. సురేశ్, గాయత్రి మెడికల్ కళాశాల అధ్యాపకుడు సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్య

... 3వ పేజీ తరువాయి

కుమార్తె కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారిని వాకబు చేసింది. చీరలు తెచ్చుకుంటానని బయటకు వెళ్లిందని వారు చెప్పడంతో అనుమానం వచ్చి అమీరుద్దీన్‌ఖాన్ ఎక్కడ ఉన్నాడో తెలుసుకుంది. అమీరుద్దీన్‌ఖాన్‌కు వడ్లపూడిలో స్నేహితుడు ఉన్నాడు. గత రెండు వారాలుగా అతడి వద్దకు వచ్చి వెళుతున్నాడు. శుక్రవారం అమీరుద్దీన్, బాలిక అక్కడకు వెళ్లారు. కుమార్తెను వెతుకుతూ జయశ్రీ వడ్లపూడిలోని అమీరుద్దీన్‌ఖాన్ స్నేహితుడికి ఇంటికి చేరింది. తలుపులు మూసి ఉండడంతో కిటికీలోంచి చూడగా, కుమార్తెతో పాటు అమీరుద్దీన్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించి, కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

... 3వ పేజీ తరువాయి

అధికారులు తర్జనభర్జన పడ్డారు. అయితే వైసీపీ ముఖ్య నేతలు ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియదు కానీ మేయర్ హరికుమారి బెంగళూరు నుంచి శుక్రవారం మధ్యాహ్నం నగరానికి చేరుకున్నారు. ఆమె బడ్జెట్ సమావేశానికి హాజరవుతారని వైసీపీ వర్గాలు తెలిపాయి. వైసీపీ కార్పొరేటర్లు వస్తారో, లేదో చూడాలి. ఏదెలా ఉన్నా బడ్జెట్ సమావేశం వరకూ ఎలాంటి ఇబ్బందీ లేదని చెబుతున్నారు.

కూపన్లకు రూ.48 లక్షలు దుర్వినియోగం

జీవీఎంసీ బడ్జెట్ సందర్భంగా కార్పొరేటర్లు అందరికీ రూ.25 వేలు చొప్పున గిఫ్ట్ కూపన్లను అధికారులు ముందుగానే పంపిణీ చేశారు. ఈ కూపన్లకు మొత్తం రూ.48 లక్షలు వెచ్చించారు. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనంటూ సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌లు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అంతేకాకుండా వారికి ఇచ్చిన కూపన్లను తిరిగి అధికారులకు వెనక్కి ఇచ్చేశారు. మిగిలిన కార్పొరేటర్లు అలాగే వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మెట్రో రైలు ప్రాజెక్టుకు ఆరు నెలల్లో భూసేకరణ

... 3వ పేజీ తరువాయి

తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఆరు నెలల్లో మొదటి దశ భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణానికి సంబంధించి కార్యాచరణ మొదలు పెట్టాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు, మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణం చేపట్టే ప్రాంతంలో కొత్తగా ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని, లేఅవుట్లు వేయడానికి ప్రణాళికలు తయారు చేయవద్దని ఆదేశించారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లకు అనుసంధానమైన రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించిన నంబర్‌ను పబ్లిక్ ప్రదేశాలలో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఆ దిశగా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని ఆదేశించారు. రుషికొండ, గంభీరంలో అడ్వంచర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్మించాలన్నారు. రానున్న రోజుల్లో 15 శాతం వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రైవేటుకు దీటుగా సేవలు విస్తృతం చేయాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఏపీఐఐసీ ద్వారా ప్రతి నెలా 100 యూనిట్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్

... 3వ పేజీ తరువాయి

బీఎం రెడ్డి వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రస్తుత అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, కార్యదర్శి నరేష్ అభినందించారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఎంకే శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

ఎండిపోయిన చెరువులు

మధురవాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఎండల ధాటికి మధురవాడ పరిసరాల్లోని చెరువులన్నీ ఎండిపోయాయి. ఒక్క చెరువులో కూడా చుక్క నీరు కానరావడం లేదు. ఎప్పుడూ నీటితో ఉండే నగరంపాలెం చెరువు, శిల్పారామం చెరువు పూర్తిగా ఎండిపోయి నేల బీటలు వారుతోంది. చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నుంచే భానుడు ప్రతాపం చూపడంతో మధురవాడ పరిసరాల్లో భూగర్భజలాలు నాలుగు మీటర్ల వరకు లోతుకు పోయినట్టు అంచనా. దీంతో ఇళ్లలోని వ్యక్తిగత బోరుబావులు కూడా ఎండిపోతున్నాయి. ఒకసారి బోరుబావి మోటారు వేస్తే మళ్లీ నీరు లభించడానికి 24 గంటలు సమయం పడుతోంది. మధురవాడ, మల్లయ్యపాలెం, మిథిలాపురి వుడాకాలనీ, పోర్టుకాలనీ, నగరంపాలెం, వాంబే కాలనీ, పాతమధురవాడ మెట్ట, ఎన్‌జీఓకాలనీ, చంద్రంపాలెం ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. జీవీఎంసీ వేసిన వీధి బోర్లు నుంచి కూడా తక్కువ ధారతో నీరువస్తోంది. కొన్ని బోర్లు పూర్తిగా మొరాయించాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని స్థానికులు భయపడుతున్నారు.



నీరు లేక పూర్తిగా ఎండిపోయిన నగరంపాలెం చెరువు

హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయాలి

» భెల్ హెచ్‌పీవీపీ ఈడీ సుబ్రహ్మణ్యంకు కార్మికుల వినతి



వినతి పత్రం అందచేస్తున్న గుర్తింపు కార్మిక సంఘ నాయకులు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ఉన్న అన్ని భెల్ యూనిట్‌లలో అమలు చేస్తున్న హయ్యర్ పెన్షన్ (ఈపీఎస్-95) విధానాన్ని భెల్ హెచ్‌పీవీపీలో కూడా అమలు చేయాలని కర్మాగార ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యంకు గుర్తింపు కార్మిక సంఘ నాయకులు విన్నవించారు. భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు కార్మిక సంఘ నాయకులు శుక్రవారం ఈడీని కలసి పెన్షన్ సమస్యను వివరించి వినతి పత్రం అందచేశారు. దేశంలో ఉన్న 17 భెల్ యూనిట్లలో ఈపీఎస్-95 విధానం అమలు చేస్తుండగా భెల్ హెచ్‌పీవీపీ యూనిట్‌లో అమలు కాకపోవడం వలన కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తపరిచారు. భెల్ హెచ్‌పీవీపీలో కూడా హయ్యర్ పెన్షన్ విధానాన్ని త్వరగా అమలు చేసి కార్మికులను ఆదుకోవాలని కార్మిక నాయకులు కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయగలనని ఈడీ హామీ ఇచ్చినట్టు కార్మిక నాయకులు తెలిపారు. ఈడీని కలసిన వారిలో శుభాకర్ సాహు, కొల్లి దేముడు, పీవీఎస్ రాజు, బి.రవీంద్రబాబు, టెక్కలి భాస్కరరావు, పి.వీరబాబు తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అగనంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తలారివానిపాలెం రైల్వే ట్రాక్ సమీపంలో శుక్రవారం రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, దానబాల అప్పలనాయుడు, మజ్జి శ్రీను, విందుల నారాయణరావు, రమణ, అప్పారావు, జగ్గారావు, బీఎస్. నాయుడు, సరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుక ఏర్పాట్లు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) :వినూత్న కార్యక్రమాలకు వేదికగా స్టీల్‌ప్లాంట్ స్టీల్‌క్లబ్ నిలుస్తుందని క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ అన్నారు. క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగువారి నూతన సంవత్సరం ఉగాదిని ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే ఏప్రిల్ 2న క్లబ్‌లో స్విమ్మింగ్ శిక్షణ ప్రారంభిస్తామన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండ 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 24 దొండకాయలు 22, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 26, వెల్లుల్లి 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60,గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర 3, తోటకూర 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	94
లైవ్ ధర	115
విత్ స్కిన్	198
స్కిన్‌లెస్	208

అభివృద్ధికి కేరాఫ్ సీఎం చంద్రబాబు

» రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ప్రశంస



దుర్గవానిపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



పార్కు, వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పెదగంట్యాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కేరాఫ్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిలుస్తున్నారని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 75వ వార్డు కండిపిల్లి వీధి, గొడ్డువానిపాలెం ప్రాంతాల్లో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రెయన్ల నిర్మాణానికి, దుర్గవానిపాలెంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి, పల్లివీధిలో రూ. 20 లక్షల తో డ్రైనేజీల నిర్మాణానికి, నెల్లిముక్కులో రూ.15 లక్షలతో కల్వర్టర్ నిర్మాణానికి, దాసరివీధిలో రూ.11 లక్షలతో డ్రెయిన్, కమ్యూనిటీ పార్కుకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే పల్లా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దుర్గవానిపాలెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళపాటు అభివృద్ధికి దూరంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇప్పుడు ముందుకు నడిపిస్తున్నారని ప్రశంసించారు. గాజువాక నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నామన్నారు. ప్రతిప్రాంతంలోను అభివృద్ధి ఆనవాళ్లు స్పష్టంగాకనిపిస్తున్నాయన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, కార్యదర్శి దొమ్మేటి పెరుమాళ్లు, సమన్వయకర్త ములకలపల్లి పెంటయ్య, జనసేన నాయకులు కోన చినఅప్పారావు, బీజేపీ నాయకులు కె.ముసలయ్య, టీడీపీ నాయకులు మొల్లి పెంటిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్, పార్కు, ఓపెన్ జిమ్ ప్రారంభం

అగనంపూడి,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 79వ వార్డు పరిధి గల్లవానిపాలెం జనచైతన్య లే అవుట్‌లో జీవీఎంసీ నిధులు రూ 50 లక్షలతో అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్, పార్కు, ఓపెన్ జిమ్‌ను శుక్రవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. పార్కుతో పాటు ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానికంగా రైతు బజారు ఏర్పాటుతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు కర్రి దేశేంద్ర, మేడిశెట్టి విజయ్, కరణం జగదీశ్, గల్లా రుద్రకుమార్, గొల్లవిల్లి కనకభవానీ, హనిత, మాడిశ వెంకటరావు, సత్యారావు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కాలనీలో 'ప్రజా చైతన్య యాత్ర'

మల్కాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 59వ వార్డు మాజీ సైనికుల కాలనీలో సీపీఎం నాయకులు శుక్రవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు స్థానికులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ నాయకులు బూడి శ్రీను, ఎల్. రాంబాబు, జె.రామునాయుడు,పైడినాయుడు, ఎం. శ్రీను, రామకృష్ణ, ప్రశాంత్, కె. రమణ, సూరిబాబు జి. రాంబాబు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 18 మందికి జరిమానా

పెందుర్తి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందికి కోర్టు రూ. 1.80 లక్షల జరిమానా విధించిందని ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని తనిఖీల్లో పట్టుకుని శుక్రవారం రెండో స్పెషల్ జ్యుడిషియల్ కోర్టు ముందు హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారన్నారు.

జింక్ గేటు సమీపంలో ట్రాఫిక్ జామ్



గేటు సమీపంలో నిలిచిపోయిన వాహనాలు

మల్కాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జింక్ గేటు వద్ద శుక్రవారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. శ్రీహరిపురం నుంచి పాతగాజువాక వెళ్లే వాహనాలు గేటు వద్ద గంటల తరబడి నిలిచిపోయాయి. ఉగాది నేపథ్యంలో కొత్త గాజువాక మార్కెట్ రద్దీగా ఉండడం, జింక్ అప్పులో ఉన్న మసీద్ వద్ద ప్రార్థనలు చేయడానికి వచ్చిన ముస్లింలు వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. గాజువాక పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

గోపాలపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు ఆమోదాన్ని ఖండిస్తూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో డిల్లీలో చేపట్టిన నిరసనకు కొత్తపాలెంలో ముస్లింలు సంఘీభావం తెలిపారు. శుక్రవారం నమాజుకు వచ్చిన వారు నల్ల బ్యాడ్జీలు ధరించి, నమాజులో పాల్గొని శాంతియుతంగా నిరసన తెలిపారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల శంకుస్థాపన

వేపగుంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 94వ వార్డులో రూ. 2.18 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, కాలువల పనులకు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి లేకుండా పాలన చేసిందని, కూటమి వాటిని సరిచేస్తూ పాలన సాగిస్తుందన్నారు.

శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. ఈమేరకు వెంకట సాయినగర్, వేపగుంట శివాలయం, వేపగుంట శ్మశాన వాటికకు రహదారి, ఎల్‌బీ నగర్‌లో ఆర్టీసీ లేఅవుట్‌కు, పురుషోత్తపురంలో రహదారి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, ఈఈ చిరంజీవి. డీఈ ప్రవీణ్ కుమార్, నాయకులు బొబ్బర నరసింహనాయుడు, మామిడి కిరణ్, సూరిబాబు, పిన్నింటి పార్వతి, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ తొలేళ్లు



గోపాలపట్నంలో అమ్మవారి ప్రతిమ ఊరేగింపు



చింతల అగ్రహారంలో ఘటాల ఊరేగింపు

గోపాలపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గోపాలపట్నం, కొత్తపాలెం గ్రామాల్లోని నూకాంబిక ఆలయాల్లో తొలేళ్ల ఉత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. సాయంత్రం 6 నుంచి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారి ఆలయం సమీపంలోని సదంపట్టు వద్దకు ఉత్సవ ప్రతిమల్ని డప్పులతో తోడ్కొని వచ్చారు. రాత్రి 9 వరకూ ప్రతిమలకు పూజలు నిర్వహించి, తరువాత ప్రతిమల్ని, ఘటాలను వీధుల్లో ఊరేగించారు. అర్ధరాత్రి దాటిన తరువాత అమ్మవారికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. కాగా శనివారం తెల్లవారు జామున 3 నుంచి భక్తులు వేలాదిగా ఆలయం వద్దకు చేరుకునే అవకాశం ఉండడంతో వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో తాగునీటి సదుపాయం, పెండాళ్లు ఏర్పాటు చేశారు.

పెందుర్తి రూరల్ : కొత్త అమావాస్య పురస్కరించుకొని చీమలాపల్లి, లక్ష్మీపురం, దుర్గానగర్, గవరపాలెం కాలనీ, చింతల అగ్రహారం, పాపయ్యారాజుపాలెం, కృష్ణరాయపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి నూకాంబిక జాతర ప్రారంభించారు. ఆలయాలను శోభాయమానంగా ముస్తాబు చేసి, వేప కొమ్మలతో అలంకరించారు. చింతల అగ్రహారంలో మహిళలు బోనాలతో ఆలయం నుంచి గ్రామం నలుమూలలా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి గోపీ అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పి. వెంకటరమణ, త్రిమాత ఆలయ ధర్మకర్త మద్దాల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోరిబిల్లి సత్తిరాజు, బొడ్డేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణబాబుకు పలు సమస్యలపై వినతి



ఎమ్మెల్యే గణబాబుకు వినతిపత్రం అందిస్తున్న ముస్లింలు

మల్కాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 59వ వార్డు మాజీ సైనికుల కాలనీలో నిర్మించిన అంబేడ్కర్ భవనం అస్తవ్యస్తంగా ఉందని, భవనం నిర్మించినప్పటికీ సమావేశాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఏమాత్రం అనుకూలంగా లేదని దళిత సంఘాల ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం వారు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబును క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మించిన భవనం చాలి చిన్నదైపోయిందని, ప్రహరీ శిథిలావస్థలో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు ఎం. పెంటారావు, జి. విజయ్‌కుమార్, నడుపూరు వెంకటరమణ, సంపత్, అందం నీలారావు (చంటి),కె. శ్రీనివాసరావు, సోమరాజు, అంథోనీ పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలపై...

గోపాలపట్నం :ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. శుక్రవారం ఆయన 89వ వార్డు కొత్తపాలెంలోని మస్జిద్ ఏ నూరానియా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడ్జెట్‌లో రూ. 5300 కోట్లు కేటాయించారన్నారు.అనంతరం వార్డులోని పలు సమస్యలపై ముస్లింలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేశ్, నాయకులు విజయ్ కుమార్, కోటేశ్వరరావు, మసీదు కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ వైరు తగిలి వ్యక్తికి తీవ్ర గాయాలు

» పలు విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

ఆటోనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 70వ వార్డు ఆటోనగర్‌లో ఓ భవనానికి పెయింటింగ్ వేస్తుండగా, హైటెన్షన్ వైర్లు తగలడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌కు చెందిన పి.రాజేష్ శుక్రవారం ఆటోనగర్‌లోని ఓ భవంతికి రంగులు వేస్తుండగా, పక్కనే ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే తొలుత స్థానికంగా గల ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఈ కారణంగా సంభవించిన విద్యుదాఘాతం కారణంగా సమీపంలో ఉన్న పదుల సంఖ్య ఇళ్లల్లో ఇంటి గోడలు, సీలింగ్‌లు దెబ్బతిన్నాయి. విద్యుత్ ఉపకరణాలు ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు,ఫ్యాన్లు, విద్యుత్ మీటర్లు తదితర సామగ్రిలు పాడయ్యాయి. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం, విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా ఉండ డంతో ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైటెన్షన్ వైర్ల కింద ఉన్న భవనాల సర్వే నిర్వహించి, ప్రజల ప్రాణాలను కాపాడాలనీ స్థానిక యువ నాయకుడు తుంపాల రమేష్ కోరారు.

ఉక్కులో కాంట్రాక్టు కార్మికుల సమ్మె

... 3వ పేజీ తరువాయి

గేటు ముందు కార్మికులు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

దుర్మార్గంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం: అఖిలపక్ష నాయకులు

కాంట్రాక్టు కార్మికుల విషయంలో యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ఆరోపించారు. ప్రధాన పరిపాలనా భవనం ముందు బైఠాయించిన కార్మికులనుద్దేశించి నాయకులు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కొంతకాలంగా కోరుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. కార్మికులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత లేదని ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యం ఇప్పటికైనా దిగిరావాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఆందోళన కార్యక్రమంలో నాయకులు మంత్రి రవి, శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, అప్పారావు,వంశీకృష్ణ, నమ్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు మద్దతు

కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆయా విభాగాధిపతుల కార్యాలయాల ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరాం, పీవీ.రమణమూర్తి, యు.రామస్వామి, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై స్థానికులు ఆందోళన



సెల్ టవర్ నిర్మాణ పనుల వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

అగనంపూడి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి శాంతినగర్‌లో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ పనులను స్థానికులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సెల్ టవర్ ఏర్పాటు పనులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నివాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేస్తే వాటి నుంచి వెలువడే తరంగాల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో టవర్ ఏర్పాటుకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. దీంతో నిర్వాహకులు పనులు నిలిపి వేశారు. కార్యక్రమంలో స్థానికులు గల్లా రాజు, నాగ ప్రసాద్, గోవిందరావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, వరహాలమ్మ, చందన, నాగమణి, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కణితిలో ఇఫ్తార్ సందడి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ జగన్ తదితరులు

కూర్మన్నపాలెం,మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా 87 వార్డు కణితిలో ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్ పాల్గొన్నారు.ముందుగా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2014-19 మధ్య మైనారిటీల సంక్షేమం కోసం టీడీపీ అనేక పథకాలను తీసుకు వచ్చిందని గుర్తుచేసారు.మైనారిటీల అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, పెంటారావు, మాటూరి రాము, అప్పారావు, రాంబాబు, కృష్ణ, పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణదారుల నుంచి వసూళ్లకు పాల్పడితే చర్యలు : ఎమ్మెల్యే

గాజువాక, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణదారుల నుంచి అక్రమంగా డబ్బులు దండితే అష్టదరిద్రాలు చుట్టుకుంటాయని, ఆర్టీఐ యాక్టివిస్టులు, ప్లానింగ్, రెవెన్యూ విభాగం, వాట్సాప్ పేపర్లు పెట్టి పత్రికా విలేకరులుగా చలామణీ అవుతున్న వారు, రాజకీయ నాయకులు గానీ దందాలు చేస్తే సహించేది లేదంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హెచ్చరించారు. గాజువాక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఇళ్లు నిర్మించుకునే వారిని బెదిరించి అక్రమంగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతూ ఇళ్ల నిర్మాణదారులను ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. 'వంద అబద్దాలు ఆడి ఓ పెళ్లి చేయటం, వెయ్యి అబద్దాలు ఆడి ఓ ఇంటిని నిర్మించటం వంటివి బృహత్తర కార్యక్రమాలు'అని పేర్కొన్నారు. ఇకపై ఇళ్ల నిర్మాణదారుల వద్దకు వెళ్లవద్దని, ఏ ఒక్కరు ఇబ్బందులకు గురిచేసినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

గనుల శాఖ కొరడా

... 3 వ పేజీ తరువాయి

లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినట్టు గుర్తించారు. అక్రమంగా తవ్విన గ్రావెల్‌కు సంబంధించి షోకాజ్ నోటీసులు ఇవ్వడానికి విశాఖలోని గనుల శాఖ ఏడీ కార్యాలయానికి ఫైలు పంపాలి. ఈలోగా కూటమి పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు గనుల శాఖ విజిలెన్స్ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో చాలా రోజులు ఫైలు పక్కనపెట్టారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో మరోసారి కథనం వెలువడడంతో విజిలెన్స్ అధికారుల్లో కదలిక వచ్చి షోకాజ్‌లకు సంబంధించిన ఫైలును గనుల శాఖ ఏడీ కార్యాలయానికి పంపారు. దీని ప్రకారం ఏపీఐఐసీ లేఅవుట్‌లో ఎనిమిది ప్లాట్ల యజమానులు, అదే ప్రాంతంలో మరో ప్లాట్‌ను ఫిల్లింగ్ చేసిన వ్యక్తికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని గనుల శాఖ నిర్ణయించింది.

ప్లాట్ల యజమానుల వివరాలు తెలియకపోవడంతో ఏపీఐఐసీకి లేఖ రాసి తరువాత షోకాజ్ జారీ చేయనున్నది. షోకాజ్ నోటీసు జారీచేసిన 15 రోజుల్లో సమాధానం తీసుకుని తరువాత జరిమానా నోటీస్ ఇస్తారు. అక్రమంగా 5.2 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినందుకు సుమారు రూ.40 కోట్ల వరకు జరిమానా పడుతుందని గనుల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలావుండగా గనుల శాఖ విజిలెన్స్ నుంచి విశాఖలోని రెగ్యులర్ కార్యాలయానికి షోకాజ్ నోటీసులు వెళ్లాయని తెలుసుకున్న మైనింగ్ చేసిన వారంతా కూటమికి చెందిన కీలక నేతలను కలిసి..జరిమానా లేకుండా చూడాలంటూ కోరుతున్నారు. గనుల శాఖ మంత్రిని కూడా కలిసే యోచనలో ఉన్నట్టు చెబుతున్నారు.

లీజుకు ఓఎఫ్‌సీ నెట్‌వర్క్

... 3వ పేజీ తరువాయి

ఇంకెంత వెచ్చిస్తున్నాయో లెక్కలు వేశారు. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇక్కడకు అనేక ఐటీ సంస్థలు రావడానికి ఆసక్తి చూపుతున్నందున ఇప్పటికే 218 కి.మీ. పొడవున వేసిన 96 ఎఫ్ ఓఎఫ్‌సీని ఎవరికైనా లీజుకు ఇస్తే అదనపు ఆదాయం వస్తుంది కదా?...అని యోచించారు. నగరంలో బీఎస్ఎన్ఎల్ ఇలాంటి ఓఎఫ్‌సీనే పలు సంస్థలకు అద్దెకు ఇచ్చింది. ఒక ఫైబర్‌కి కి.మీ.కు ఏడాదికి రూ.20 వేలు వసూలు చేస్తోంది. ఆ లెక్కన చూసుకుంటే ఈపీడీసీఎల్ వద్ద 96 ఫైబర్లు, 218 కి.మీ. పొడవున ఉన్నాయి. భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో వీటిని లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఓఎఫ్‌సీని సాంకేతికంగా నిర్వహించే పరిజ్ఞానం లేకపోవడంతో సప్లయ్, ఇనస్టాలేషన్, కమిషనింగ్, టెస్టింగ్...వంటి పనులన్నీ లీజు సంస్థే చేయాలనే నిబంధనలతో పదేళ్లకు లీజుకు ఇవ్వడానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీచేసింది. దీనికి జాతీయ స్థాయిలో స్పందన వస్తోంది. ఢిల్లీ, ముంబై నగరాల నుంచి ఎయిర్‌టెల్, వీటీఎల్ వంటి సంస్థలు ఫోన్లు చేసి వివరాలు తెలుసుకుంటున్నాయి. విశాఖపట్నం వంటి నగరంలో వీధి వీధినా రోడ్లు తవ్వి ఓఎఫ్‌సీ కేబుల్ వేయడం ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో ఇప్పటికే వేసి ఉన్న కేబుల్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉండడంతో చాలా మంది ముందుకు వస్తున్నారు.

రెండో దశలో 907 కి.మీ.

విశాఖపట్నంలో రెండో దశలో 907 కి.మీ. పొడవున భూగర్భ విద్యుత్ కేబుల్ వేస్తున్నారు. అయితే ఇందులో ఈపీడీసీఎల్ ఓఎఫ్‌సీ వేయడం లేదు. నిధులు తక్కువగా ఉన్నందున ఆ ఆలోచన విరమించుకుంది. అయితే తమ విద్యుత్ కేబుల్‌తో పాటు భూగర్భంలో ఓఎఫ్‌సీ వేసుకునేందుకు అవకాశం ఇస్తామని, ఎవరైనా మంచి ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరింది. దీనికి కూడా చాలా మంది ముందుకు వస్తున్నారు. ఓఎఫ్‌సీ వేయడానికి కిలోమీటరుకు సుమారు రూ.4 లక్షల వ్యయం అవుతుంది. దాని నిర్వహణ అంతా మళ్లీ మామూలే. ఇందులో ఎవరు ఎక్కువ ఆదాయం ఇస్తారో వారికి లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఈ ఆదాయం కోట్ల రూపాయల్లోనే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి వైభవంగా క్షీరాభిషేకం



మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉభయ దాతల సమక్షంలో అమ్మవారిని అలంకరించి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కార్మిక వివాదాలకు కాంట్రాక్టర్ల దోపిడీయే కారణమని ఫిర్యాదు

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కార్మిక వివాదాలకు కారణమైన పనుల ఖర్చు అంచనాలను సవరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటరెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పీఎఫ్, ఈఎస్ఐలు కలపకుండా ఎస్టిమేషన్లు వేసి టెండర్లు పిలిచి జీవీఎంసీని తప్పుదారి పట్టిస్తూ ఆమోదిస్తున్నారని, ఇదే కార్మిక వివాదాలకు కారణమవుతోందని తెలిపారు. ఇందుకు సంబంధించిన అగ్రిమెంట్ కాపీలను కూడా కలెక్టర్‌కు చూపామన్నారు. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐలో యాజమాన్య వాటా కలపడం లేదని ఆరోపించారు. కార్మికులను కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని వెంకటరెడ్డి విమర్శించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టెండర్లు పిలవాలని, పీఎఫ్, ఈఎస్ఐలతో కలిపి ఎస్టిమేషన్లు సవరించి పూర్తి వేతనాలు చెల్లించేలా చూడాలని, కార్మికులపై వేధింపులు లేకుండా చర్య తీసుకొని న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

డాక్టర్ ప్రశాంతకుమారికి అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు

కంచరపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు డా.సముద్రాల ప్రశాంతకుమారి డాక్టరు ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు పొందినట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ తెలియజేశారు. తన పరిశోధనలలో ప్రతిభను కనబరిచినందుకు ఈ అవార్డును మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్, నీతి ఆయోగ్, ఎన్‌సీటీ ఢిల్లీ వారు ఆన్‌లైన్‌లో ప్రదానం చేశారన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ అవార్డును గత నెలలో ప్రకటించగా గురువారం అందజేశారన్నారు.



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అక్కయ్యపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఎనభై అడుగుల రోడ్డు, శ్రీనివాసనగర్, మహారాణి పార్లర్ ఏరియా, పుట్ట బంగారమ్మ ఆలయం ఏరియా, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, సాయిబాబా ఆలయం ఏరియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, పాత పోస్టాఫీసు రోడ్డు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాద బీమా కోసం దరఖాస్తు చేయండి

అక్కయ్యపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదై ఉండి ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యానికి గురైన అసంఘటిత కార్మికులకు ప్రమాద బీమా కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కార్మికశాఖ సహాయ కమిషనర్ సర్కిల్-2 ఎస్.గోవింద్ సూచించారు. ప్రమాద బీమా సదుపాయం కల్పించాలన్న ఆలోచనతో కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ 2023 ఆగస్టులో ఎక్స్‌గ్రేషియా మాడ్యూల్స్ ప్రారంభించారన్నారు. 2022 మార్చి 31 లేదా అంతకుముందు ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులు క్లెయిమ్ చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఇంతవరకు దరఖాస్తు చేయనివారు కార్మిక శాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

సోదరికి యువతి అప్పగింత

అక్కయ్యపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో కుటుంబ సభ్యులతో తగాదా పడి విశాఖ విచ్చేసిన ఓ యువతిని ఆమె సోదరికి అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన యువతి (22) వైజాగ్‌లో ఓ యువకుడిని ప్రేమించి ఇక్కడికి వచ్చిందన్నారు. ఆమె జగదాంబ జంక్షన్ వద్ద ఒంటరిగా ఉండడంతో మహారాణిపేట పోలీసులు గమనించి తమ సిబ్బందికి అప్పగించారన్నారు. టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆ యువతికి ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. ఆమె దగ్గర ఉన్న సెల్‌ఫోన్ నెంబరుతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. మహారాణిపేట మహిళా కానిస్టేబుల్ జి.రమ్య ఆ యువతికి కౌన్సెలింగ్ ఇచ్చాక ఆమె సోదరికి అప్పగించామన్నారు.

కలెక్టరేట్, కేజీహెచ్ రహదారిలో మురుగు

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయం, కేజీహెచ్‌కు కూతవేటు దూరంలో ఉండే రహదారుల కూడలిలో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ రహదార్లలో అడుగిడితే ముక్కు మూసుకోవాల్సిందే. రహదారిపైనే మురుగునీటి ప్రవాహం ఉన్నా జీవీఎంసీ బాధ్య అధికారులు కళ్లు మూసుకుంటున్నారు. పారిశుధ్యం నిర్వహణ తీరు అధ్వానంగా ఉంది. ఈ రహదారుల పరిసర ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. 'స్వచ్ఛ విశాఖ' ర్యాంక్ సాధనకు సంకల్పించి ప్రజలను చైతన్య పరుస్తున్న జీవీఎంసీ అధికారుల దృష్టికి ఇక్కడి దుస్థితి కనిపించకపోవడం ఆశ్చర్యకరం. అనారోగ్య సమస్యలతో కేజీహెచ్‌కు వచ్చిపోయే రోగులు, వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఇక్కడ పరిస్థితిని చూసి ఏవగించుకుంటున్నా యంత్రాంగంలో కదలిక లేకపోవడం విశేషం. అంగటిదిబ్బ ముస్లిం శ్మశాన వాటిక రహదారి గుండా కేజీహెచ్‌కు వెళ్లే మార్గంలో మురుగు కాలువ మూసుకుపోయింది. దీంతో మురుగు నీరు రహదారులపైకి చేరుకుంటోంది. సమీపంలో ఉన్న అపార్టుమెంట్ వద్ద కాలువపై ఇటీవల నిర్మాణం చేపట్టి సిమెంట్‌తో మూసివేసిన కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. కేజీహెచ్, కలెక్టరేట్లకు వెళ్లే రహదారి, పాత గ్రంథాలయం ప్రహ్లాద కల్యాణ మండపం రహదారులు పల్లంగా ఉండడంతో మురుగు నీరు జగదాంబ సెంటరు వైపు పరుగులు పెడుతోంది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు వ్యాపించి జ్వరాలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మూడు నెలలుగా ఈ సమస్య పరిష్కారం కాకపోవడం, జీవీఎంసీ, సచివాలయ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కేజీహెచ్‌కు వెళ్లే రహదారిపై మురుగు నీరు

ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలవాలి: కలెక్టర్

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలకు అన్ని విధాలా అండగా నిలవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ వర్గాలకు అన్ని అవకాశాలు కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను చేరువ చేయాలని సూచించారు. ఇంత వరకు నమోదైన అట్రాసిటీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. డివిజన్ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తులో బాధితులకు అండగా నిలవాలన్నారు. ఇటీవల ఆక్సిజన్ టవర్‌లో జరిగిన ఘటనలో పోలీసుల పని తీరును ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశంసించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీఆర్వో, ఆర్డీవో, ఏసీపీలు, డీసీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

181 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మెరుగైన పనితీరు కనబరిచిన 181 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు అందించారు. శుక్రవారం పోలీసు కమీషనరేట్‌లో నేర సమీక్ష సమావేశం జరిగింది. ప్రతీ నెల మెరుగైన పని తీరు కనబరుస్తున్నవారికి ప్రోత్సాహకంగా రివార్డులు ఇచ్చారు. హోంగార్డు నుంచి సీఐ స్థాయి వరకు ప్రశంసా పత్రాలు, రివార్డులను అందజేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3 లక్షల ఆర్థిక సహాయం

కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా ఇటీవల మృతిచెందిన గొరుగంట్ల దుర్గాప్రసాదరావు కుటుంబానికి రూ.2 లక్షలు, తీవ్ర గాయాలపాలైన పి.తిరుమల శ్రీనివాస్, దున్న చంద్రశేఖర్‌లకు రూ.50 వేల వంతున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 30 మందికి రూ.25.5 లక్షల సహాయం అందించినట్లు కమీషనరేట్ వర్గాలు తెలిపాయి.

ముస్లింల జుమా నమాజు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మర్రిపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలలో భాగంగా చివరి శుక్రవారం మర్రిపాలెం జాకీర్‌హుస్సేన్‌నగర్ మజీద్ ఈ ఖదీర్ వద్ద పెద్దఎత్తున ముస్లింలు పవిత్ర జుమా నమాజును ఆచరించారు. హాఫీజ్ (ముస్లిం మతగురువు) ఖురాన్ సూక్తులను వివరించారు. సాయంత్రం మగ్రిబ్ నమాజ్‌కు ముందు జాకీర్‌హుస్సేన్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు దీక్షను విరమించారు. మజీద్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యువతకు మంచి నడవడిక అవసరం



న్యాయ కళాశాలలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



విశ్వ కళాశాలలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యదేవి

సీతమ్మధార/సీతంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): యువతకు మంచి నడవడిక ముఖ్యమని న్యాయమూర్తులు ఉద్ఘాటించారు. తెలిసీతెలియని వయసులో తప్పుడు మార్గంలో నడిచే అవకాశం ఉందని, క్రమశిక్షణతో ఉంటే ఇలాంటి వాటికి దూరంగా ఉంటారని పేర్కొన్నారు. పోక్సో చట్టంపై శుక్రవారం సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఎన్‌బీఎం న్యాయ కళాశాలలో జిల్లా సెషన్స్ జడ్జి ఆలపాటి గిరిధర్, సీతంపేటలోని విశ్వ కళాశాలలో పదకొండో అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యదేవి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టంలోని పలు అంశాలను జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ విద్యార్థులను చైతన్యపరిచారు. బాధితులకు ఏవిధంగా న్యాయ సహాయం చేయాలన్నది వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ డి.వి.రమణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గాయత్రి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. పోక్సో చట్టంలో లోటుపాట్లపై విశ్వ కళాశాలలో అదనపు జిల్లా జడ్జి శ్రీసత్యదేవి అవగాహన కల్పించారు. ద్వారకా పోలీసుస్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు, విశ్వ విద్యాసంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవ రచయితలకు ఉపయుక్తంగా హిందీ సదస్సు



హిందీ రచయితల ముగింపు సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, అతిథులు, విద్యార్థినులు

జ్ఞానాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ నిదేశాలయం సౌజన్యంతో ఎనిమిది రోజులు ఉత్సాహంగా జరిగిన హిందీ నవ రచయితల శిబిరం శుక్రవారం ముగిసింది. హిందీయేతర విద్యార్థినులకు ఈ శిబిరం ఎంతో ఉపయుక్తంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా రచయితల్లో సృజనాత్మకత, సొంతశైలిని అభివృద్ధి చేసి వారి భావాలను సరైన విధంగా వ్యక్తీకరించేందుకు మార్గదర్శకత్వం చేసిందన్నారు. విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించేందుకు ఈ శిబిరం ఉపయోగపడిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.షైజీ పేర్కొన్నారు. హిందీ నేర్చుకోవాలనుకునేవారు ఈ సదస్సులో ఉత్సాహంగా మమేకమయ్యారు. ముగింపు కార్యక్రమంలో రామదాస్ నారాయణ తోండే, డా.పురుషోత్తమ్ పాటిల్. సునీల్ కుమార్, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ సుధ, డా.ఎస్ దీప్తి, డా.కోటేశ్వరరావు, డాక్టర్ నళిని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీతమ్మధార/మురళీనగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో పలువురు దరఖాస్తుదారులకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శుక్రవారం సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్య పీడితుల వైద్య ఖర్చుల కోసం చేసిన ఒరిజినల్ బిల్సు పెట్టి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నజీర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి.ఉషాకిరణ్, బీజేపీ ఇన్‌చార్జి సురేష్ బాబు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

మురళీనగర్ బృందావన్ పార్కు, వైశాఖీ స్పోర్ట్సు పార్కుల్లో రూ.53.35 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు శుక్రవారం భూమిపూజ చేశారు. పార్కులను మరింత అహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు. కూటమి నాయకులు నజీర్, ఉషాకిరణ్, ఎస్.వరప్రసాద్, వెంకటరావు, పార్కుల కమిటీ సభ్యులు, స్థానికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రేటర్ 51వ వార్డులో పారిశుధ్య కార్మికులకు కార్యాలయం లేక ఇబ్బందులు పడుతున్నారని జనసేన అధ్యక్షుడు జి.అప్పారావు అన్నారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ డిమాండ్

డాబాగార్డెన్స్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. దేశంలో 52 శాతం జనాభా కలిగిన ఓబీసీల కోసం పార్లమెంట్ సమావేశాల్లో ఓబీసీ బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. శుక్రవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కమిషన్ 38 సిఫార్సుల అమలుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. చేనేత కార్మికులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ఓబీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఎన్టీఆర్ ఆలోచన విధానాన్ని సీఎం చంద్రబాబు అమలు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తణుకు సత్యవరప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు కె.మల్లేశ్వరి, కె.వెంకటరామలక్ష్మి, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంగిరేకుల వరప్రసాద్ యాదవ్

జర్నలిస్టుల ఉగాది సంబరాలు

డాబాగార్డెన్స్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. అతిథులుగా జి.ఆంజనేయులు, జైకిషన్, మట్టపల్లి హనుమంతరావు, ఆచార్య బాబీవర్ధన్, రంగారెడ్డి బంగార్రాజు హాజరయ్యారు. జర్నలిస్టులు సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. జర్నలిస్టుల పిల్లల ప్రదర్శనలు అలరించాయి. మహిళలకు బహుమతులు అందజేశారు. జర్నలిస్ట్ ధృవతార మానికొండ చలపతిరావు పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. జర్నలిస్టుల సంఘం నాయకులు గంట్ల శ్రీనుబాబు, పి.నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టుకు ఆరు నెలల్లో భూసేకరణ

... 3వ పేజీ తరువాయి

తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఆరు నెలల్లో మొదటి దశ భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణానికి సంబంధించి కార్యాచరణ మొదలు పెట్టాలన్నారు. మెట్రో రైలు ప్రాజెక్టు, మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణం చేపట్టే ప్రాంతంలో కొత్తగా ఎటువంటి అనుమతులు ఇవ్వరాదని, లేఅవుట్లు వేయడానికి ప్రణాళికలు తయారుచేయవద్దని ఆదేశించారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లకు అనుసంధానమైన రోడ్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించిన నంబర్‌ను పబ్లిక్ ప్రదేశాలలో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఆ దిశగా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని ఆదేశించారు. రుషికొండ, గంభీరంలో అడ్వంచర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు నిర్మించాలన్నారు. రానున్న రోజుల్లో 15 శాతం వృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రైవేటుకు దీటుగా సేవలు విస్తృతం చేయాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. ఏపీఐఐసీ ద్వారా ప్రతి నెలా 100 యూనిట్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు జీవీఎంసీ బడ్జెట్ సమావేశం

... 3వ పేజీ తరువాయి

అధికారులు తర్జనభర్జన పడ్డారు. అయితే వైసీపీ ముఖ్య నేతలు ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియదు కానీ మేయర్ హరికుమారి బెంగళూరు నుంచి శుక్రవారం మధ్యాహ్నం నగరానికి చేరుకున్నారు. ఆమె బడ్జెట్ సమావేశానికి హాజరవుతారని వైసీపీ వర్గాలు తెలిపాయి. వైసీపీ కార్పొరేటర్లు వస్తారో, లేదో చూడాలి. ఏదేలా ఉన్నా బడ్జెట్ సమావేశం వరకూ ఎలాంటి ఇబ్బందీ లేదని చెబుతున్నారు.

కూపన్లకు రూ.48 లక్షలు దుర్వినియోగం

జీవీఎంసీ బడ్జెట్ సందర్భంగా కార్పొరేటర్లు అందరికీ రూ.25 వేలు చొప్పున గిఫ్ట్ కూపన్లను అధికారులు ముందుగానే పంపిణీ చేశారు. ఈ కూపన్లకు మొత్తం రూ.48 లక్షలు వెచ్చించారు. ఇది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనంటూ సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌లు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అంతేకాకుండా వారికి ఇచ్చిన కూపన్లను తిరిగి అధికారులకు వెనక్కి ఇచ్చేశారు. మిగిలిన కార్పొరేటర్లు అలాగే వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రేమికుల ఆత్మహత్య

... 3వ పేజీ తరువాయి

కుమార్తె కనిపించకపోవడంతో ఇరుగుపొరుగు వారిని వాకబు చేసింది. చీరలు తెచ్చుకుంటానని బయటకు వెళ్లిందని వారు చెప్పడంతో అనుమానం వచ్చి అమీరుద్దీన్‌ఖాన్ ఎక్కడ ఉన్నాడో తెలుసుకుంది.

అమీరుద్దీన్‌ఖాన్‌కు వడ్లపూడిలో స్నేహితుడు ఉన్నాడు. గత రెండు వారాలుగా అతడి వద్దకు వచ్చి వెళుతున్నాడు. శుక్రవారం అమీరుద్దీన్, బాలిక అక్కడకు వెళ్లారు. కుమార్తెను వెతుకుతూ జయశ్రీ వడ్లపూడిలోని అమీరుద్దీన్ ఖాన్ స్నేహితుడికి ఇంటికి చేరింది. తలుపులు మూసి ఉండడంతో కిటికీలోంచి చూడగా, కుమార్తెతో పాటు అమీరుద్దీన్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించి, కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా శ్రీనివాస్

... 3వ పేజీ తరువాయి

బీఎం రెడ్డి వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రస్తుత అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, కార్యదర్శి నరేష్ అభినందించారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఎంకే శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

ప్రజాధనం వృథా!



నిరుపయోగంగా వదిలేసిన సిమెంటు పలకలు

జ్ఞానాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో వినియోగించేందుకు జోన్-5 ఇంజనీరింగ్ అధికారులు వేలాది రూపాయలు ఖర్చుచేసి సిమెంటు పలకలు తయారు చేయించారు. వాటిని తయారు చేసి ఏడాది గడుస్తున్నా ఎక్కడా వినియోగించలేదు.. సరికదా.. వాటిని జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వెనుక రోడ్డులో వదిలేశారు. ఇలా ప్రజాధనం వృథా చేయడంతో స్థానికులు మండిపడుతున్నారు. వెంటనే ఇంజనీరింగ్ అధికారులు వీటిని వినియోగించాలని కోరుతున్నారు.

ఏసీబీ వలలో నక్కపల్లి ఆర్ఐ

- రైతుల నుంచి రూ.12 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- పొలంలో బోరు వేసుకోవడానికి అనుమతి కోసం లంచం డిమాండ్

నక్కపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పొలంలో బోరు వేయడానికి అనుమతి కోసం రైతుల నుంచి లంచం తీసుకుంటుండగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఇన్‌చార్జి ఆర్ఐ కన్నబాబును శుక్రవారం మధ్యాహ్నం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి డీఎస్పీ ఎన్.రమ్య మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలంలోని ఒక గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమ పొలంలో బోరు వేయించుకోవడానికి వాల్టా చట్టం కింద అనుమతి కోసం వారం కిందట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. వాటిని పరిశీలించిన ఇన్‌చార్జి ఆర్ఐ మోటకట్టు కన్నబాబు, ఒక్కో రైతు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని రైతులు చెప్పగా.. వెయ్యి చొప్పున తగ్గించి రూ.12 వేలు ఇస్తేనే అనుమతి పత్రం జారీ చేస్తానని చెప్పారు. దీంతో రైతులు విశాఖలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన మేరకు రైతులు శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆర్ఐ కన్నబాబుకు రూ.12 వేలు ఇచ్చారు. అప్పటికే సమీపంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి వచ్చి కన్నబాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కన్నబాబు నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శనివారం విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు. బాధిత రైతులు తమ పేర్లు బహిర్గతం చేయవద్దని విజ్ఞప్తి చేసినందున వారి వివరాలను వెల్లడించడం లేదని ఆమె తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీతోపాటు సీఐలు సీహెచ్ లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు, బి.సుప్రియ, వైకె కిశోర్‌బాబు పాల్గొన్నారు.



ఏసీబీకి దొరికిపోయిన ఇన్‌చార్జి ఆర్ఐ కన్నబాబు

మైనర్లతో పనిచేయిస్తే కఠిన చర్యలు

» కార్మిక శాఖ అధికారుల హెచ్చరిక



సైకిల్ దుకాణ యజమానికి జరిమానా విధిస్తున్న లేబర్ విభాగాధికారులు

వెంకోజీపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీకాలనీ సులభ్ కాంప్లెక్సు ఎదురుగానున్న సైకిల్ దుకాణంలో మైనర్లతో పనులు చేయిస్తున్నారన్న ఫిర్యాదుతో కార్మిక శాఖ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. ఇద్దరు మైనర్‌లు విధులను నిర్వహించడం చూసి సైకిల్ దుకాణం యజమానికి జరిమానా విధించారు. మైనర్లతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే వెలగపూడి దృష్టికి జేఆర్ నగర్ కాలనీ సమస్యలు



ఎమ్మెల్యే వెలగపూడిని కలసిన జేఆర్ నగర్ కాలనీ వాసులు

ఎంవీపీ కాలనీ, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : తమ కాలనీలో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉండిపోయిన సమస్యలు పరిష్కరించేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును పదిహేనో వార్డు జేఆర్ నగర్ వాసులు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం కలసిన గ్రామస్థులు కాలనీలోని సమస్యలను విన్నవించారు. కాలనీలోని పార్కుకు న్యాయపరమైన చిక్కులు, రోడ్లు, డ్రయినేజీలకు మరమ్మతులు వంటివి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ కేఎస్సార్ మూర్తి, గంగాధరం, రవిరాజు, పీవీఎస్ఎన్ మూర్తి, నాగేశ్వరరావు, చిరంజీవిరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3 లక్షల ఆర్థిక సహాయం

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా ఇటీవల మృతిచెందిన గొరుగంట్ల దుర్గా ప్రసాదరావు కుటుం బానికి రూ.2 లక్షలు, తీవ్ర గాయాలపాలైన పి.తిరుమల శ్రీనివాస్, దున్న చంద్రశేఖ ర్‌లకు రూ.50 వేల వంతున ఆర్థికసహాయం అందజేశారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 30 మందికి రూ.25.5 లక్షల సహాయం అందించినట్లు కమీషనరేట్ వర్గాలు తెలిపాయి.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీలీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్** : జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా**: శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 30, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయ 14,కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 22, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 22, కాప్సికమ్ 36, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనస పొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	425
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	94
లైవ్ ధర	115
విత్ స్కిన్	198
స్కిన్‌లెస్	208

బడ్డీల తొలగింపులో మహా నిర్లక్ష్యం

» ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా పట్టించుకునే వారే కరువు
» నామ్ కే వాస్తే చర్యలకే పరిమితం అవుతున్న అధికారులు
» తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు



ఫుట్‌పాత్‌లపై ఉన్న బడ్డీలు



బడ్డీలు ఏర్పాటు చేయకుండా తాడు కట్టిన దృశ్యం

పెదవాల్తేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరు రైతుబజార్ ఎదుట అనధికారిక బడ్డీల తొలగింపులో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి అనుమతులు లేకుండాఇక్కడ అనేక బడ్డీలు ఉన్నాయి. త్రీటౌన్ పోలీసు స్టేషన్, రైతుబజార్ గేటు నుంచి పెదవాల్తేరు విశాఖ ఐ ఆస్పత్రి వరకూ ఫుట్‌పాత్‌లపై మరికొన్ని దుకాణాలు తాజాగా వెలిశాయి. దీంతో పాదచారులు ఫుట్‌పాత్‌లపై నడిచే అవకాశం లేకుండాపోతోంది. తాజాగా అక్కడ రాత్రి పూట టిఫిన్ సెంటర్లతో పాటు పకోడి బడ్డీలు ఏర్పాటు చేయడం చేస్తున్నారు. దీంతో 3 టౌన్ పోలీసు స్టేషన్, రైతుబజారు, సీబీఐ జంక్షన్, శ్రీకరకచెట్టు పోలమాంబ ఆలయం, విశాఖ ఐ ఆస్పత్రి జంక్షన్ వరకూ వాహనదారులు తమ భవనాల్లోకి వెళ్లాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రైతుబజార్ గేటు ఎదురుగా ఒక్కొక్కరూ మూడు, నాలుగుషాపులు పెట్టి ఒక్కో షాపును రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అద్దెకు ఇస్తున్నారు. కొంత కాలంగా ఇక్కడి అనధికారిక బడ్డీలు తొలగించాలనే డిమాండ్ ఉన్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. శనివారం ఉదయం అనధికారిక డ్డీలను జీవీఎంసీ ఏసీపీమధుసూదన్, 3 టౌన్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు, ఎస్ఐ ఖదర్ బాషా, జీవీఎంసీ సైన్మాన్ రాజు సిబ్బంది తదితరుల సమక్షంలో కొన్ని బడ్డీలను తొలగించారు. అనంతరం ఎవరు అనధికారిక బడ్డీలు పెట్టకుండా 3 టౌన్ పోలీసుస్టేషన్ నుంచి రైతుబజారు గేటు వరకు తాళ్లను కట్టారు.

ముగిసిన లైబ్రరీ ఆటోమేషన్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రభుత్వ కళాశాలల గ్రంథాలయ అధికారులు

మద్దిలపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన లైబ్రరీ ఆటోమేషన్ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గ్రంథాలయాల అధికారులకు సోల్ సాఫ్ట్‌వేర్‌పై గుజరాత్‌కు చెందిన ఇన్ఫ్లిబిట్ నెట్ కేంద్రం సైంటిస్ట్ హేమ చోలిన్, ఆర్తి సవాలేలు అయిదు రోజుల లైబ్రరీ ఆటోమేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగాధిపతి వి.ధనరాజు మాట్లాడుతూ గ్రంథాలయాల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం అవసరం ఉందన్నారు. గ్రంథాలయాల్లో వినియోగించే సోల్ సాఫ్ట్‌వేర్ గురించి నిర్వాహకులు అవగాహన కల్పించుకోవడం ద్వారా మరింత మెరుగైన పనితీరు చూపవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసప్రసాద్, అధ్యాపకులు శ్రావణ్ కుమార్, కె.రవిబాబు, జీవీ ప్రతాప్, జి.లక్ష్మణరావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

వెంకోజీపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాతవెంకోజీపాలెంలో శ్రీసీతారామ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు సంఘం సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన సంఘం పెద్దలు ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేసి కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ నెల 30న స్వామి వారి పెళ్లి రాటతో ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించి, ఆఖరి రోజైన ఏప్రిల్ 6న భద్రాది ముహూర్తానికి శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు, అధ్యక్షులు కర్రి వెంకట సూరి అప్పారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శి కర్రి రవికుమార్, సహాయ కార్యదర్శి రాజగిరి సతీష్, సభ్యులు యల్లపు నాగరాజు, కాళ్ల ఆనంద్ పాల్గొన్నారు.

సాంస్కృతిక రాజధానిగా విశాఖ మారాలి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, వేదికపై రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, ప్రతినిధులు

మద్దిలపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కల్చరల్ క్యాపిటల్‌గా విశాఖ మారాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆకాంక్షించారు. పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన విశాఖ జాతీయ నాటకోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఇళ్లల్లోనే నేరుగా సినిమాలు చూసే అవకాశం ఉన్న ఈ రోజుల్లో నాటకాలను ప్రదర్శించి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ప్రాణం కంటే సంగీతం, కళలు ముఖ్యమని ఆనాడు బీర్బల్ ఉదాహరణలతో అక్బర్‌కు వివరించారని చెప్పారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళలు, కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ తెలుగు నాటకాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిలపడానికి తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. అనంతరం ప్రదర్శించిన 'ద సాల్ట్ ఆఫ్ లైఫ్' నాటకం అలరించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని గిరిజన తెగకు చెందిన జానపద కథల ఆధారంగా ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. కార్యక్రమంలో చలసాని కృష్ణ ప్రసాద్, నాంచారయ్య, జి.రాంబాబు, మంతెన సత్యనారాయణ, మస్తాన్‌రెడ్డి, కళాభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలవాలి : కలెక్టర్

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీలకు అన్ని విధాలా అండగా నిలవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ వర్గాలకు అన్ని అవకాశాలు కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను చేరువ చేయాలని సూచించారు. ఇంత వరకు నమోదైన అట్రాసిటీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. డివిజన్ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తులో బాధితులకు అండగా నిలవాలన్నారు.

ఇటీవల ఆక్సిజన్ టవర్‌లో జరిగిన ఘటనలో పోలీసుల పని తీరును ఎమ్మెల్యే విష్ణుకుమా ర్ రాజు ప్రశంసించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వందుల రవీంద్రబాబు, పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీఆర్‌వో, ఆర్‌డీవో, ఏసీపీలు, డీసీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో నక్కపల్లి ఆర్ఐ

» రైతుల నుంచి రూ.12 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
» పొలంలో బోరు వేసుకోవడానికి అనుమతి కోసం లంచం డిమాండ్



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి ఆర్ఐ కన్నబాబు

నక్కపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పొలంలో బోరు వేయడానికి అనుమతి కోసం రైతుల నుంచి లంచం తీసుకుంటుండగా అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఇన్‌చార్జి ఆర్ఐ కన్నబాబును శుక్రవారం మధ్యాహ్నం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి డీఎస్పీ ఎన్.రమ్య మీడియాకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి మండలంలోని ఒక గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమ పొలంలో బోరు వేయించుకోవడానికి వాల్టా చట్టం కింద అనుమతి కోసం వారం కిందట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు. వాటిని పరిశీలించిన ఇన్‌చార్జి ఆర్ఐ మోటకట్ల కన్నబాబు, ఒక్కో రైతు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.15 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని రైతులు చెప్పగా.. వెయ్యి చొప్పున తగ్గించి రూ.12 వేలు ఇస్తేనే అనుమతి పత్రం జారీ చేస్తానని చెప్పారు. దీంతో రైతులు విశాఖలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారు చెప్పిన మేరకు రైతులు శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆర్ఐ కన్నబాబుకు రూ.12 వేలు ఇచ్చారు. అప్పటికే సమీపంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి వచ్చి కన్నబాబును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కన్నబాబు నుంచి నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శనివారం విశాఖలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు. బాధిత రైతులు తమ పేర్లు బహిర్గతం చేయవద్దని విజ్ఞప్తి చేసినందున వారి వివరాలను వెల్లడించడం లేదని ఆమె తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీతోపాటు సీఐలు సీహెచ్ లక్ష్మణరావు, పి.శ్రీనివాసరావు, బి.సుప్రియ, వైకే కిశోర్‌బాబు పాల్గొన్నారు.

శారీరక దివ్యాంగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

పెదవాల్తేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ నైపుణ్యాభివృద్ధి(ఎస్‌డీసీ) విశాఖపట్నం, స్వయంకృషి వెల్ఫేర్ సొసైటీతో కలిసి శారీరక వైకల్యం కలిగిన దివ్యాంగులు, దృష్టి లోపం ఉన్న అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత కంప్యూటర్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామ్‌రాజు తెలిపారు. ప్రదీప్ కుమార్ శిక్షణకర్తగా వ్యవహరిస్తారరన్నారు. ఆయన బెంగళూరు, హైదారాబాద్‌లలోని వివిధ ఐటీ కంపెనీల్లో పని చేసిన అనుభవం కలిగిన వారని తెలిపారు. ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణ 45 రోజులు ఉంటుందన్నారు. రోజుకు నాలుగు గంటలు చొప్పున ఉంటుందన్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి లయన్స్ కంప్యూటర్ శిక్షణా కేంద్రం, నగరంలోని లాసన్స్ బే కాలనీ బీజేపీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలు, అభ్యర్థుల పేర్ల నమోదు కోసం ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, వాట్సాప్ నంబరు 8885278899, 7995530426కు పంపించాలని కోరారు.

'దేశ ఆర్థిక వ్యవస్థలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి'

ఎంవీపీ కాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక వ్యవస్థలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్‌ఆర్ జిత అన్నారు. ఎంవీపీ కాలనీలోని సమతా కళాశాలలో దిశ ఎంసీఎస్ మీట్ పేరిట జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అళ్వార్‌దాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఎస్ పి.రవీంద్ర, కళాశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎస్.విజయరవీంద్ర ప్రసంగించారు. మేనేజ్‌మెంట్, కామర్స్ సైన్స్, విద్యార్థుల కోసం మార్కెట్, ఫైనాన్స్, కామర్స్, ఐపీఎల్ ఆక్షన్, మ్యాథ్స్ సైన్స్, ఫిజిక్స్, బోటనీ, అండ్ న్యూట్రిషన్, కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన వివిధ ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ జీ శ్రీనివాసరావు, దిశ ఎంసిఎస్ మీట్ కన్వీనర్ గంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డుకు ట్యాక్స్ కట్టలేదని జీవీఎంసీ సిబ్బంది హల్‌చల్

» దుకాణం బోర్డు తొలగింపునకు వెళ్లిన సిబ్బంది
» ఉన్నతాధికారుల జోక్యంతో వెనక్కి.



బోర్డు తొలగింపునకు యత్నిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : దుకాణానికి ఉన్న బోర్డుకు ట్యాక్స్ కట్టకపోవడంతో జీవీఎంసీ అధికారులు జరిమానా విధించారు. ఎంవీపీ కాలనీలోని ఓ మిఠాయి దుకాణదారుడికి కొద్ది రోజుల క్రితం పేరు నేమ్ బోర్డు ఫీజు కింద రూ.89 వేలు కట్టమని నోటీసులు ఇచ్చారు. బోర్డుకు అంత ట్యాక్స్ కట్టమనడం ఏమిటంటూ సదరు దుకాణదారు ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక సచివాలయం కార్యదర్శి సాయిరాం ఆధ్వర్యంలో సిబ్బంది ఎక్సకవేటర్‌తో వచ్చి దుకాణం బోర్డును తొలగిస్తామంటూ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బోర్డుకు ట్యాక్స్ కట్టకపోతే భవనం కూల్చేస్తామన్నంత హంగామా చేశారు. సదరు దుకాణం యజమాని ఉన్నతాధికారులతో మాట్లాడగా, తాము కూల్చివేతలు వంటివి చేపట్టాలని చెప్పలేదని, బకాయి రుసుం వసూలు చేయమని మాత్రం ఆదేశించామని చెప్పారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బందిని అధికారులు వెనక్కు రప్పించారు.

దీనిపై సచివాలయం కార్యదర్శి సాయిరాంను అడగ్గా.. ట్యాక్స్‌ను గురువారం కడతామని చెప్పారని, కట్టకపోవడంతో శుక్రవారం ఎక్సకవేటర్‌తో వెళ్లామని చెప్పారు. అయితే ఉన్నతాధికారులు మీకు ఇలా చెయ్యమని చెప్పలేదట కదా అని ప్రశ్నించగా.. ఆయన నుంచి సమాధానం కరువైంది.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు

» ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ చర్యలు చేపడుతోందని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఆర్టీసీ విశాఖ రీజియన్ సివిల్ ఇంజినీర్ బి.వెంకట జనార్ధనం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందించిన వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆర్ఎం మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్సులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ వాటర్‌ప్లాంట్ ఎంతగానో ఉపయోగపడగలదన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని ప్రయాణికులకు అందించేందుకు వాటర్‌ప్లాంట్ విరాళంగా అందజేసిన వెంకట జనార్ధనంను అభినందించారు. కార్యక్రమంలోడిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎస్. అరుణకుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీ నరసింగరావు, ఆర్టీసీ అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

181 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన పనితీరు కనబరిచిన 181 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు అందించారు. శుక్రవారం పోలీసు కమీష నరేట్‌లో నేర సమీక్ష సమావేశం జరిగింది. ప్రతీ నెల మెరుగైన పనితీరు కనబరుస్తున్న వారికి ప్రోత్సాహకంగా రివార్డులు ఇచ్చారు. హోంగార్డు నుంచి సీఐ స్థాయి వరకు ప్రశంసా పత్రాలు, రివార్డులను అందజేశారు.

లీజుకు ఓఎఫ్‌సీ నెట్‌వర్క్

... 3వ పేజీ తరువాయి

ఇంకెంత వెచ్చిస్తున్నాయో లెక్కలు వేశారు. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇక్కడకు అనేక ఐటీ సంస్థలు రావడానికి ఆసక్తి చూపుతున్నందున ఇప్పటికే 218 కి.మీ. పొడవున వేసిన 96 ఎఫ్ ఓఎఫ్‌సీని ఎవరికైనా లీజుకు ఇస్తే అదనపు ఆదాయం వస్తుంది కదా?...అని యోచించారు. నగరంలో బీఎస్ఎన్ఎల్ ఇలాంటి ఓఎఫ్‌సీనే పలు సంస్థలకు అద్దెకు ఇచ్చింది. ఒక ఫైబర్‌కి కి.మీ.కు ఏడాదికి రూ.20 వేలు వసూలు చేస్తోంది. ఆ లెక్కన చూసుకుంటే ఈపీడీసీఎల్ వద్ద 96 ఫైబర్లు, 218 కి.మీ. పొడవున ఉన్నాయి. భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో వీటిని లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఓఎఫ్‌సీని సాంకేతికంగా నిర్వహించే పరిజ్ఞానం లేకపోవడంతో సప్లయ్, ఇనస్టాలేషన్, కమిషనింగ్, టెస్టింగ్...వంటి పనులన్నీ లీజు సంస్థే చేయాలనే నిబంధనలతో పదేళ్లకు లీజుకు ఇవ్వడానికి ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీచేసింది. దీనికి జాతీయ స్థాయిలో స్పందన వస్తోంది. ఢిల్లీ, ముంబై నగరాల నుంచి ఎయిర్‌టెల్, వీటీఎల్ వంటి సంస్థలు ఫోన్లు చేసి వివరాలు తెలుసుకుంటున్నాయి. విశాఖపట్నం వంటి నగరంలో వీధి వీధినా రోడ్లు తవ్వి ఓఎఫ్‌సీ కేబుల్ వేయడం ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో ఇప్పటికే వేసి ఉన్న కేబుల్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉండడంతో చాలామంది ముందుకు వస్తున్నారు.

రెండో దశలో 907 కి.మీ.

విశాఖపట్నంలో రెండో దశలో 907 కి.మీ. పొడవున భూగర్భ విద్యుత్ కేబుల్ వేస్తున్నారు. అయితే ఇందులో ఈపీడీసీఎల్ ఓఎఫ్‌సీ వేయడం లేదు. నిధులు తక్కువగా ఉన్నందున ఆ ఆలోచన విరమించుకుంది. అయితే తమ విద్యుత్ కేబుల్‌తో పాటు భూగర్భంలో ఓఎఫ్‌సీ వేసుకునేందుకు అవకాశం ఇస్తామని, ఎవరైనా మంచి ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరింది. దీనికి కూడా చాలామంది ముందుకు వస్తున్నారు. ఓఎఫ్‌సీ వేయడానికి కిలోమీటరుకు సుమారు రూ.4 లక్షల వ్యయం అవుతుంది. దాని నిర్వహణ అంతా మళ్లీ మామూలే. ఇందులో ఎవరు ఎక్కువ ఆదాయం ఇస్తారో వారికి లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. ఈ ఆదాయం కోట్ల రూపాయల్లోనే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఉక్కులో కాంట్రాక్టు కార్మికుల సమ్మె

... 3వ పేజీ తరువాయి

గేటు ముందు కార్మికులు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

దుర్మార్గంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం: అఖిలపక్ష నాయకులు

కాంట్రాక్టు కార్మికుల విషయంలో యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తుందని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ఆరోపించారు. ప్రధాన పరిపాలనా భవనం ముందు బైఠాయించిన కార్మికులనుద్దేశించి నాయకులు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కొంతకాలంగా కోరుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. కార్మికులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత లేదని ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యం ఇప్పటికైనా దిగిరావాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఆందోళన కార్యక్రమంలో నాయకులు మంత్రి రవి, శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, అప్పారావు,వంశీకృష్ణ, నమ్మి రమణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు మద్దతు

కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆయా విభాగాధిపతుల కార్యాలయాల ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.అయోధ్యరాం, పీవీ.రమణమూర్తి, యు.రామస్వామి, డి.ఆదినారాయణ పాల్గొన్నారు.

గనుల శాఖ కొరడా

... 3 వ పేజీ తరువాయి

లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినట్టు గుర్తించారు. అక్రమంగా తవ్విన గ్రావెల్‌కు సంబంధించి షోకాజ్ నోటీసులు ఇవ్వడానికి విశాఖలోని గనుల శాఖ ఏడీ కార్యాలయానికి ఫైలు పంపాలి. ఈలోగా కూటమి పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు గనుల శాఖ విజిలెన్స్ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో చాలా రోజులు ఫైలు పక్కనపెట్టారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో మరోసారి కథనం వెలువడడంతో విజిలెన్స్ అధికారుల్లో కదలిక వచ్చి షోకాజ్‌లకు సంబంధించిన ఫైలును గనుల శాఖ ఏడీ కార్యాలయానికి పంపారు. దీని ప్రకారం ఏపీఐఐసీ లేఅవుట్‌లో ఎనిమిది ప్లాట్ల యజమానులు, అదే ప్రాంతంలో మరో ప్లాట్‌ను ఫిల్లింగ్ చేసిన వ్యక్తికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని గనుల శాఖ నిర్ణయించింది. అయితే ప్లాట్ల యజమానుల వివరాలు తెలియకపోవడంతో ఏపీఐఐసీకి లేఖ రాసి తరువాత షోకాజ్ జారీ చేయనున్నది. షోకాజ్ నోటీసు జారీచేసిన 15 రోజుల్లో సమాధానం తీసుకుని తరువాత జరిమానా నోటీస్ ఇస్తారు. అక్రమంగా 5.2 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వినందుకు సుమారు రూ.40 కోట్ల వరకు జరిమానా పడుతుందని గనుల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలావుండగా గనుల శాఖ విజిలెన్స్ నుంచి విశాఖలోని రెగ్యులర్ కార్యాలయానికి షోకాజ్ నోటీసులు వెళ్లాయని తెలుసుకున్న మైనింగ్ చేసిన వారంతా కూటమికి చెందిన కీలక నేతలను కలిసి...జరిమానా లేకుండా చూడాలంటూ కోరుతున్నారు. గనుల శాఖ మంత్రిని కూడా కలిసే యోచనలో ఉన్నట్టు చెబుతున్నారు.

నగరానికి చేరుకున్న సన్‌రైజర్స్ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 30న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు శుక్రవారం నగరానికి చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి ప్రత్యేక బస్సులలో రాడిసన్ బ్లూ హోటల్‌కు చేరుకున్నారు. నగరానికి వచ్చిన వారిలో కెప్టెన్ కమిన్స్, ఆల్‌రౌండర్లు నితీష్‌కుమార్‌రెడ్డి, హర్షల్ పటేల్, అభిషేక్ శర్మ, వియాన్ మల్డర్, మెండిస్, బౌలర్లు మహ్మద్ షమి, రాహుల్ చహర్, ఆడమ్ జంపా, సిమ్రజీత్ సింగ్, అన్సారి, జయదేవ్ ఉనద్కర్, ఇషాన్ మలింగ, బ్యాటర్లు ఇషాన్ కిషన్, అతర్వ తైడే, అభినవ్ మనోహర్, అనికేత్ వర్మ, సచిన్ బేబి, హెనిరిచ్, హెడ్, కోచ్ మురళీధరన్ మరో 15 మంది సపోర్టింగ్ స్టాఫ్ ఉన్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు శనివారం నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.



హర్షా పటేల్ | జయదేవ్ ఉనాద్కట్ | ట్రావిస్ హెడ్ | పాట్ కమిన్స్ | ఆడమ్ జంపా | క్లాసెన్

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే బోర్డు ఆదేశాల మేరకు పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ-గుణుపూర్-విశాఖ (58506/ 58505) పాసింజర్ రైళ్లకు ఏప్రిల్ 1 నుంచి 30 వరకు ఒక స్లీపర్ క్లాసు, విశాఖ-కిరండూల్-విశాఖ (58501/58502) పాసింజర్ రైళ్లకు ఏప్రిల్ 12 నుంచి 30 వరకు ఒక స్లీపర్ క్లాసు, సంబల్‌పూర్-నాందేడు-సంబల్‌పూర్ (20809/ 20810) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఏప్రిల్ 4 నుంచి 29 వరకు థర్డ్ ఏసీ కోచ్ జత చేస్తున్నామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

66 మందికి కారుణ్య నియామకాలు

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం 66 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. విధులను క్రమశిక్షణతో నిర్వహించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బాధ్యతగా మెలగాలన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి సైన్స్ పరీక్ష

ఆరిలోవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం పదో తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ తెలిపారు. పరీక్షకు 29.405 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 29,233 మంది హాజరయ్యారని, 172 మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల పరిశీలకుడు దేవానందరెడ్డి నాలుగు, డీఈవో ఐదు, ప్రత్యేక స్క్వాడ్ 26 కేంద్రాలను సందర్శించారన్నారు. ఓపెన్ స్కూలు సాంఘికశాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షలను 15 కేంద్రాల్లో నిర్వహించగా 727 మంది విద్యార్థులకు గాను 648 మంది హాజరయ్యారని, 79మంది హాజరుకాలేదని తెలిపారు.

1న సాంఘిక శాస్త్రం పరీక్ష

పదోతరగతి సాంఘికశాస్త్రం పరీక్ష ఈనెల 31వ తేదీకి బదులుగా ఏప్రిల్ ఒకటో తేదీన నిర్వహిస్తామని డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. 31న రంజాన్ కావడంతో ఈ మార్పు జరిగిందని వివరించారు. కాగా పరీక్ష సమయం యధావిధిగా ఉదయం 9-30 నుంచి 12-45 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, విద్యార్థులు, తల్లిదండ్రులు మార్పును గమనించాలని డీఈవో కోరారు.

క్రికెట్ మ్యాచ్‌కు 60 ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు 60 ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. గాజువాక, పాతపోస్టాఫీస్, సింహాచలం, కూర్మన్నపాలెం, తగరపువలస, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ నుంచి ఈ బస్సులు నడుస్తాయన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటనుంచి రాత్రి పదిగంటల వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని, క్రికెట్ అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి అప్పలనాయుడు కోరారు.

జూలో జంతువుల సంతానోత్పత్తి

- రేసు కుక్కలకు 14 పిల్లలు
- పెయ్యికి జన్మనిచ్చిన అడవిదున్న

ఆరిలోవ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో రేసుకుక్కలు 14 పిల్లలకు, అడవిదున్న (ఈ జాతిలో ఆడ, మగ రెండింటినీ అలాగే పిలుస్తారు) పెయ్యికి జన్మనిచ్చాయి. జూలో ప్రస్తుతం సుమారు మూడు జతల రేసు కుక్కలు ఉండగా, 14 పిల్లలకు జన్మనిచ్చాయని క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. ప్రస్తుతం ఇవి డెన్‌లో ఉన్నాయన్నారు. మరిన్ని పిల్లలు పుట్టి ఉండవచ్చునని, అవి కనిపించకుండా ఇతర ప్రదేశాల్లో ఉంటాయని ఆమె తెలిపారు. రేసుకుక్కలు మనుషులను దగ్గరికి రానివ్వవని, చాలా భయంకరంగా వ్యవహరిస్తాయని, అందువల్ల బయటకు కనిపించిన పిల్లలను మాత్రమే లెక్కించగలిగామన్నారు.



పిల్లలకు పాలిస్తున్న రేసు కుక్క

వీటికి గర్భధారణ సమయం మూడు నెలలు మాత్రమేనన్నారు. రేసుకుక్కల బ్రీడింగ్ మన దేశంలో మరెక్కడా లేదని, వీటికి ప్రత్యేక గుర్తింపు ఉందని ఆమె వివరించారు. కాగా అడవి దున్న కూడా ఒక పెయ్యికి జన్మనిచ్చిందని ఆమె తెలిపారు. గోరస్ జాతికి చెందిన ఈ దున్న కూడా ఇక్కడి జూలోనే పుట్టిందన్నారు. జూలోకి కొత్తగా మరిన్ని జంతువులు రావడం ఆనందంగా ఉందని, ప్రస్తుతం అవన్నీ ఆరోగ్యంగా ఉన్నాయన్నారు. జూ వైద్యుల పర్యవేక్షణలో పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నామన్నారు. వీటన్నింటిని త్వరలో సందర్శకుల వీక్షణకు వీలుగా మోటుల్లో ఉంచుతామన్నారు.



అడవిదున్నతో పెయ్యి

నూతన ఆవిష్కరణలకు వేదికగా మెడ్‌టెక్ జోన్

- కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయమంత్రి శ్రీపాద నాయక్
- సోలార్ యూనిట్‌లు ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలు, ఆరోగ్య సంరక్షణ సాంకేతికతలో ప్రకాశవంతమైన శక్తిగా ఏపీ మెడ్‌టెక్ జోన్‌సాగుతోందని కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయమంత్రి శ్రీపాదనాయక్ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఒక మెగా వాట్ సోలార్ జోన్ రెండో దశను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెడ్‌టెక్ జోన్ స్వావలంబనకు వెలుగుగా మారిందని, వైద్య పరికరాల పరిశ్రమను వృద్ధిలో నడిపిస్తోందన్నారు. నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలవడంతో వైద్య సాంకేతికతలో భారత్‌ను ఆత్మనిర్భర్‌గా మారుస్తుందన్నారు. సోలార్ జోన్ స్థిరమైన, ఇంధన సమర్థ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుందన్నారు. కీలకమైన మెడ్‌టెక్ జోన్‌లో పునరుత్పాదక శక్తిని వినియోగించడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా జోన్‌లో సోలార్ పవర్డ్ ట్రై సైకిల్‌ను పరిశీలించారు. జోన్ సీఈవో జితేంద్రశర్మ మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధనంలో కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తామన్నారు. జోన్‌లో 100శాతం శక్తి తటస్థంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సోలార్ ట్రై సైకిల్‌ను నడుపుతున్న కేంద్ర సహాయమంత్రి శ్రీపాద నాయక్

వైసీపీ నేత కుమారుడిపై రెవెన్యూ అధికారుల ప్రేమ

- ప్రభుత్వ భూమిలో షెడ్లు నిర్మించినా తొలగించని వైనం
- దాని పక్కనే ఆక్రమణలను కూలగొట్టిన యంత్రాంగం

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గాజువాకకు చెందిన వైసీపీ నేత కుమారుడిపై రెవెన్యూ అధికారులు అత్యంత ప్రేమ కనబరుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో అతడికి మేలు చేసేలా వారు తీసుకున్న చర్యలు దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఇతరుల ఆక్రమణలను యంత్రాలతో తొలగించిన రెవెన్యూ అధికారులు వైసీపీ నేత కుమారుడి ఆక్రమణపై కన్నెత్తి చూడకపోవడం అతనిపై ఉన్న ప్రేమను తేటతెల్లం చేస్తోంది.

పెదగంట్యాడ సర్వే నంబరు 43/1లోని సుమారు 432 చదరపు గజాల స్థలాన్ని నలుగురు వ్యక్తులు ఆక్రమించారు. అందులో గాజువాకకు చెందిన వైసీపీ నేత కుమారుడు నాలుగు షెడ్‌లను నిర్మించి అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నాడు. అదే సర్వే నంబరులో వైసీపీ నేతకుమారుడి షెడ్‌లకు ఆనుకుని ఉన్న ప్రైవేటు భూమిలో మరో వ్యక్తి ఇటీవల కల్యాణ మండపం నిర్మించాడు. ఇందుకోసం కొంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. అయితే ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోకుండా వైసీపీ నేత కుమారుడు ఒత్తిడి చేయడంతో అధికారులు పట్టించుకోలేదు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమవడంతో పెదగంట్యాడ రెవెన్యూ అధికారులు బుధవారం యంత్రాలతో సహా వెళ్లి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. కాగా అదే భూమిలో వైసీపీ నేత కుమారుడు ఆక్రమించి నిర్మించిన షెడ్ల జోలికి వెళ్లకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఒకే సర్వేనంబరులో ఉన్న 432 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు సర్వే చేసి మరీ గుర్తించిన అధికారులు పూర్తిగా ఆక్రమణలు తొలగించి, స్వాధీనం చేసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ నేత కుమారుడికి మేలుచేసేందుకు తమ శాయశక్తులా పనిచేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఆక్రమిత స్థలంలోని కల్యాణ మండపంతో పాటు మిగిలిన ఆక్రమణలను తొలగించాల్సిన అధికారులు పక్షపాతంతో వ్యవహరించడం సరికాదని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో రహదారి నిర్మాణంపై సీరియస్



చిన దబ్బంద రోడ్డుపై కందకం తీస్తున్న రెవెన్యూ సిబ్బంది, రోడ్డుకు అడ్డుగా తవ్విన గొయ్యి

- రోడ్డుకు అడ్డంగా 25 చోట్ల కందకాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆనందపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిలోవ పంచాయతీ చినదబ్బంద గ్రామం నుంచి రియల్టర్ల భూముల వరకు అక్రమంగా రోడ్డు నిర్మించడంపై రెవెన్యూ అధికారులు సీరియస్ అయ్యారు. 'రియల్టర్ల మాయాజాలం' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై స్పందించారు. తహసీల్దారు శ్యాంప్రసాద్ ఆదేశాలతో దబ్బంద వీఆర్వో కె.శ్రీనివాస్, సిబ్బంది ఎక్సకవేటర్‌తో నిర్మాణంలో ఉన్న రోడ్డుపై 25 చోట్ల కందకాలు తవ్వారు. ప్రభుత్వ స్థలంలో అనుమతిలేకుండా రోడ్డు నిర్మించడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఆనందపురం మండల పంచాయతీ విస్తరణాధికారి, మామిడిలోవ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎస్టిమేషన్ ఆమోదం లేకుండా చేపట్టిన నిర్మాణంపై పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు ఆరా తీశారు.ఇప్పటివరకు చేసిన పనులకు బిల్లుచేయరాదని నిర్ణయించారు.

ఏయూలో బర్గామో వర్సిటీ ప్రతినిధులు



ప్లామినియా నికోరాను సత్కరిస్తున్న వీసీ

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇటలీలోని బర్గామో విశ్వవిద్యాలయానికి చెందిన అంతర్జాతీయ సంబంధాల డిప్యూటీ రెక్టార్ ప్రొఫెసర్ ప్లామినియా నికోరా శుక్రవారం సందర్శించారు. వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్‌తో భేటీ అయ్యారు. అనంతరం ప్రొఫెసర్ ప్లామినియా నికోరాను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుం జయరావు, ఆహబ్ సీఈవో రవిఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో పదోన్నతులకు ఇంటర్వ్యూలు

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కెరియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్)లో భాగంగా ఏయూలో శుక్రవారం పదోన్నతులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హుల నుంచి గతంలోనే దరఖాస్తులను స్వీకరించారు. 20 మందిని ఎంపిక చేశారు. శుక్రవారం పది మందికి ఇంటర్వ్యూలను నిర్వహించారు. మిగిలిన వారికి శనివారం నిర్వహిస్తారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, గవర్నర్ నామినీ పాండిచ్చేరికి చెందిన ప్రొఫెసర్ పార్థసారథి, సబ్జెక్టుల నిపుణులు ప్రక్రియ నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ధనుంజయరావు, డీన్లు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు పక్కా ప్రణాళికలతో రండి

- రూ. 23,870 కోట్లతో నాబార్డు పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్
- కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా అవసరాల దృష్ట్యా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.23,870 కోట్లతో నాబార్డు రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్రణాళికను కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ విడుదల చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో బ్యాంకు అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా నాబార్డు డెవలప్‌మెంట్ మేనేజరు బసంత కుమార్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈలు, పునరుత్పాదక ఇంధనం, ఎగుమతి క్రెడిట్, సుస్థిర వ్యవసాయంపై దృష్టిసారించామన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 16,207.50 కోట్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలకు రూ.612 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి రూ.300.74కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.3,368.99 కోట్లు, ఇతర విభిన్న అవసరాలకు రూ.3,384.38 కోట్లు కేటాయించామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నచిన్న యూనిట్ల రూపంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు పక్కా ప్రణాళికలతో రావాలని, అన్ని విధాలా సహకరిస్తామన్నారు. పరిశ్రమలకు మౌలిక సదుపాయాల ఏర్పాటుతోపాటు నూతన ఆవిష్కరణను ప్రోత్సహించాలని సూచించారు. గాజువాక ఆటోనగర్ వద్ద ఆర్వోబీ, పెదగంట్యాడ, అగనంపూడి,ఆటోనగర్‌లో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, విశ్వకర్మ యోజన పథకాలపై సూచనలిచ్చారు. విజిలెన్స్, కోర్టు కేసులు, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆటోనగర్, ఐటీ హిల్స్ వద్ద సమావేశమందిరం ఏర్పాటుచేయాలని ఐలా ప్రతినిధులు కోరారు. డీఐసీ జీఎం ఆదిశేషు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

క్రైం... crime news

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్య

సీతంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ఆవేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు అక్కయ్యపాలెం నందగిరినగర్‌లో కెర్రు పద్మ ఇద్దరు కుమారులతో ఉంటోంది. చిన్న కుమారుడు కెర్రు ప్రతాప్ (20) ఓ కొరియర్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతడికి మద్యం, సిగిరెట్ తాగే అలవాటు ఉంది. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేస్తుండగా తనకు తెలిసిన కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా చేరాలని ప్రతాప్‌కు సోదరుడు సూచించాడు. దీంతో కోపగించుకున్న ప్రతాప్ లేచి అద్దం విరగ్గొట్టి గదిలోకి వెళ్లి పడుకున్నాడు. హాలులో పద్మ, పెద్దకుమారుడు, కోడలు నిద్రించారు. శుక్రవారం ఉదయం ప్రతాప్ గది తలుపులు తట్టినా స్పందన లేకపోవడంతో పక్కన ఉన్న అపార్టుమెంట్ కిటికీలోంచి చూసేసరికి ఫ్యానుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు తల్లి పద్మ సమాచారం ఇచ్చింది. వేరే ఉద్యోగం ఇష్టంలేక, మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడినట్టు ఫిర్యాదు చేసింది. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ స్వామినాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



సీతంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ నుంచి తెలుగు తల్లి ఫ్లైఓవర్‌కి వెళ్లే రహదారిలో ఎంఈఎస్ ఆఫీస్ గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు చూశారు. వెంటనే 112కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని పరిశీలించి కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వయసు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, స్థానికంగా యాచిస్తూ ఉండేవాడని విచారణలో తేలింది. మృతుడి కుటుంబ సభ్యులుంటే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

- కాళ్లు, చేతులు కట్టేసి కొట్టారని కుటుంబ సభ్యుల ఆరోపణ
- కంచరపాలెం సమీపంలోని జైభారత్ నగర్‌లో ఘటన



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కంచరపాలెం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున కంచరపాలెం సమీపంలోని జైభారత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ... బర్మాక్యాంపు జైభారత్ నగర్‌లో ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన పందిరి హనుమంతరావు (63) నివసిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున జైభారత్‌నగర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వచ్చి హనుమంతురావు మృతిచెందినట్టు నిర్ధారించారు. కంచరపాలెం సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సమీర్ ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. తెల్లవారు జామున మూడు గంటల సమయంలో హనుమంతురావు బయటకు వెళ్లినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు. బర్మాక్యాంపులోని ఓ వృద్ధురాలి ఇంట్లోకి చొరబడగా అక్కడ వారు గమనించి కాళ్లు, చేతులు స్తంభానికి కట్టేసి కొట్టడంతో మృతిచెందినట్టు ఆరోపించారు. ఈ ఘటనలో ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సమీర్ దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

గాజువాక/ఆనందపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం భార్యను హత్య చేసిన ముద్దాయికి జీవిత ఖైదు, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ గాజువాక 13వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలావున్నాయి...ఆనందపురం మండలం దబ్బంది గ్రామానికి చెందిన పాపాన సోమినాయుడు (41)కు అదే గ్రామానికి చెందిన సోమేశ్వరితో వివాహమయింది. ఆ సమయంలో కట్న కానుకలు అందజేశారు. అయితే అదనపు కట్నం కోసం తరచూ భార్యను వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో 2012లో భార్య సోమేశ్వరిని మంచానికి తాళ్లతో కట్టి, కిరోసిన్ పోసి హత్యచేశాడు. స్థానిక పోలీసులు కేసు నమోదుచేయగా, అప్పటి నుంచి కోర్టులో విచారణ జరుగుతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.పావని నిందితుడిపై నేరాన్ని రుజువు చేయడంతో ముద్దాయికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పెళ్లి పేరుతో మోసం: యువకుడిపై కేసు నమోదు

మల్కాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని లొంగదీసుకొని, గర్భవతిని చేసిన యువకుడిపై మల్కాపురం పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. స్థానిక ఏకేసీకాలనీకి చెందిన ప్రవీణ్ (24) అదే కాలనీకి చెందిన 19 ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో మోసం చేసి మూడేళ్లుగా శారీరక సంబంధం కొనసాగించాడు. ఈ క్రమంలో ఆమె ఇటీవల గర్భం దాల్చింది. దీంతో పెళ్లి చేసుకోవాలని ప్రవీణ్‌ను నిలదీసింది. అతడు సమాధానం ఇవ్వకుండా దాటవేస్తుండడంతో మోసం చేసినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అతడిని పిలిపించి విచారించగా, పెళ్లికి నిరాకరించడంతో సీఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నకిలీ విలేకరులు

సీతంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తాము తిన్న ఐస్ క్రీములకు డబ్బులు అడిగితే విలేకరులమంటూ బెదిరించిన ఇద్దరు దుకాణదారుడితో గొడవపడ్డారు. నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదుపులోకి తీసుకున్నారు. మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీకి చెందిన బాగది వేణుగోపాల్ (29) కారు డ్రైవర్. అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌కు చెందిన గెంజి హరికృష్ణ (27) ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ అక్కయ్యపాలెంలోని ఓ దుకాణానికి వెళ్లి ఐస్‌క్రీమ్‌లు తిన్నారు. డబ్బులు అడిగితే ఎదురు తిరిగి విలేకరమంటూ గొడవ పడ్డారు. దుకాణదారుడి ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి 28 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది తనిఖీ చేస్తుండగా ఝార్ఖండ్‌కు చెందిన పూర్ణిమ దేవి, ప్రియాంక రాయ్ గంజాయిని మహారాష్ట్రకు రవాణా చేస్తుండగా పట్టుబడ్డారని, వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కింద అర్హులకు ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయసు వారై, బీఈ, బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఐటీఐ వెల్డర్, ఫిట్టర్, టర్నర్, డిప్లమో మెకానికల్ చేసిన వారికి ఐదు నెలలు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. వసతి, ఉపాధికి సహకారం అందిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విశాఖపట్నం సింధియా జంక్షన్లో ఉన్న సీఈఎంఎస్ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 0891-2704010, 86884 11100, 83319 01237 నంబర్లలో సంప్రతించి ఏప్రిల్ 5లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

30న ఉడా చిల్డ్రన్ ఎరీనాలో ఉగాది వేడుకలు

మహారాణిపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఉగాది వేడుకల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 30న ఉడా చిల్డ్రన్ ఎరీనా ఆడిటోరియంలో అధికారికంగా వేడుకలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఉగాది పండగ సందర్భంగా మామిడి, అరటి తోరణాలు, జ్యోతి ప్రజ్వలన, కవి సమ్మేళనం సహా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవో శ్రీలేఖ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.